# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 26-7-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 263 పేజీలు 8 వెల: రూ.1/-


## ఇబ్రహీంపట్నంలో ఇంటర్ విద్యార్థిని మృతి

రంగారెడ్డి, జులై 25: జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో గల గాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అఖిల అనే విద్యార్థిని మృతిచెందింది.

కళాశాలలో విద్యార్థిని అస్వస్థతకు గురవ్వగా హుటాహుటిన చికిత్స నిమిత్తం గ్లోబల్ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థిని మృతిచెందినట్లుగా వైద్యులు ప్రకటించారు. విద్యార్థిని మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మరోమారు దద్దరిల్లిన ధర్నా చౌక్

### విపక్షాల పిలుపుతో కదలివచ్చిన జనం
### కొత్త సచివాలయ,అసెంబ్లీ నిర్మాణాలపై పోరు
### చలో సెక్రటేరియట్‌ను అడ్డుకున్న పోలీసులు
### నేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలింపు
### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ నేతలు

హైదరాబాద్,జూలై25 (ఆంఎన్‌ఎ): కొత్త సచివాల నిర్మాణం, అసెంబ్లీ కోసం ఎర్రమంజిల్ భవనాల కూల్చివేతలను నిరసిస్తూ అఖిలపక్షం చేపట్టిన చలో సెక్రటేరియట్ ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నేతలు ధర్నాకు దిగారు. సర్కార్ తీరుపై విమర్శలు గుప్పించారు. ఇందిరాపార్క్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు అఖిలపక్ష నేతలు సచివాలయం వైపు వెళ్లకుండా అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో ఇక్కడ పోలీసులకునేతలకు మధ్య స్వల్పవివాదం చోటు చేసుకుంది. ప్రజలు భారీగా తరలిరావడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రజాస్వామ్య తెలంగాణ వేదిక పిలుపు మేరకు అఖిల పక్షం ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడికి నేతలు ప్రయత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. ధర్నాచౌక్ వద్ద నిరసన చేపట్టేందుకు ఇందిరాపార్కు నుంచి ర్యాలీగా వెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎన్. బాలమల్లేశ్‌ను ఆయన ఇంటివద్దే పోలీసులు అరెస్టు చేసి జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తెదేపా నేతలు ఎల్.రమణ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ధర్నాచౌక్ వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అరెస్టు చేసి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అన్నిసౌకర్యాలు ఉన్న అసెంబ్లీ, సచివాలయాల పునర్నిర్మాణం చేపట్టవద్దని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇందిరాపార్కు పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటికే భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ర్యాలీలో ప్రజాస్వామిక తెలంగాణ వేదిక నాయకులు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్, చింతల రామచంద్రారెడ్డి, రావుల చంద్రశేఖర్ రెడ్డి, అద్దంకి దయాకర్, ఇందిరా శోభన్, పీఓడబ్ల్యూ సంధ్య ఇతరులు పాల్గొన్నారు. వీరిని బలవంతంగా అరెస్ట్ చేసి వాహనాలు ఎక్కించారు పోలీసులు. ముషీరాబాద్, గోషామహల్ స్టేడియానికి తీసుకెళ్లారు. కేసీఆర్ నియంతృత్వం నశించాలి.. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి.. అంటూ నినాదాలు చేశారు నాయకులు. సెక్రటేరియట్ వరకు శాంతియుత ర్యాలీకి అనుమతివ్వని పోలీసుల తీరును తప్పుపట్టారు. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేందుకు చలో సచివాలయం కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ.60 వేల కోట్ల అప్పు ఉంటే.. కేసీఆర్ నాలుగేండ్ల పాలనలో రూ.లక్ష కోట్లకు పైగా అదనంగా అప్పులు చేశారని అన్నారు. దళితుల మనోభావాలు దెబ్బతీసేలా అంబేద్కర్ విగ్రహాన్ని పంజాగుట్టలో తొలగించారనీ.. ప్రజా అవసరాలు పక్కకు పెట్టి ప్రగతి భవన్ లో కేసీఆర్ నిద్రపోతున్నారని విమర్శించారు చింతల. ప్రతిపక్షాల పోరాటానికి ఇది అంతం కాదు.. ఆరంభం మాత్రమే అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాసమస్యలు పక్కనపెట్టి.. అనేక లోపాలున్న మున్సిపల్ చట్టాన్ని పాస్ చేసేందుకు వాడుకున్నారని టీడీపీ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ చట్టంపై గవర్నర్ స్పందించినందుకు కృతజ్ఞతలు చెప్పారు. కొత్త అసెంబ్లీ, కొత్త సెక్రటేరియట్ ఎందుకు కడుతున్నారని హైకోర్టు వేసే ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదన్నారు. మున్సిపల్ చట్టంపై గవర్నర్ స్పందించినట్టు.. కొత్త అసెంబ్లీ, కొత్త సెక్రటేరియట్ నిర్మాణంపై కూడా గవర్నర్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఎవరు అడిగారని కొత్త సెక్రటేరియట్, కొత్త అసెంబ్లీ నిర్మాణం చేస్తున్నారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. చరిత్ర ఆనవాళ్లు ఉండకూడదని కేసీఆర్ ఇవన్నీ చేస్తున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ నాయకులు కూడా కొత్త సెక్రటేరియట్ వద్దని నిరసన చేపట్టాలని కొండా విశ్వేశ్వరరెడ్డి కోరారు. సంక్షేమ పథకాలకు కూడా పైసలు లేవని.. ముందు వాటికి డబ్బులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



అఖిలపక్షం చలో సెక్రటేరియట్ పిలుపుతో ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కోదండరామ్, వివేక్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పిఎల్ విశ్వేశ్వర్ రావు, అద్దంకి దయాకర్‌రావు తదితరులు.

## మిషన్ కాకతీయ పథకానికి అంతర్జాతీయ గుర్తింపు

హైదరాబాద్, జులై25(ఆర్ ఎన్‌ఎ) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పథకానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. రాష్ట్రంలో చెరువుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇండోనేసియాలోని బాలిలో జరుగనున్న అంతర్జాతీయ సదస్సులో ఈ పథకంపై ప్రజెంటేషన్ ఇచ్చేందుకు రావాల్సిందిగా థర్డ్ వరల్డ్ ఇరిగేషన్ ఫోరం (డబ్ల్యూఐఎఫ్3) ప్రతినిధి విజయ్. కె.లబ్బెత్వార్ నుంచి ఇరిగేషన్ శాఖకు లేఖ అందింది. ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ సంస్థ (ఐసీఐడీ) ఆధ్వర్యంలో ఈ సదస్సు జరగనుంది. మిషన్ కాకతీయపై సీఎం ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, చిన్న నీటివనరుల ఎస్‌ఈ కె.శ్యాం సుందర్‌లు రాసిన సాంకేతిక పత్రం ఈ సదస్సులో సమర్పించేందుకు ఆమోదం పొందింది. ఆన్ ఆఫ్ పద్ధతి ద్వారా నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలో నీటి నిర్వహణ అభివృద్ధి, ఎస్సారెస్పీలో నీటి సమర్థ వినియోగంపై రాసిన సాంకేతిక పత్రాలు కూడా ఆమోదం పొందాయి. ఈ మేరకు అధికారులు సదస్సుకు హాజరై మూడు అంశాలపై ఇరిగేషన్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ మూడు సాంకేతిక పత్రాలు రాసిన అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, ఇరిగేషన్ ఈఎన్‌సీ మురళీధర్, అడ్మిన్ ఈఎన్‌సీ బి.నాగేందర్‌రావులు అభినందించారు.

## వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్త

### బంధువుల సమక్షంలో చెప్పుతో కొట్టిన భార్య

హైదరాబాద్,జూలై25 (ఆర్ ఎన్‌ఎ): నగరంలోని నిజాంపేటలో ఓ భార్య తన భర్తకు దేహశుద్ధి చేసింది. తనను నిర్లక్ష్యం చేసి.. మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భర్తను చెప్పుతో కొట్టింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన లక్ష్మణ్‌కు లక్కారం గ్రామానికి చెందిన సౌజన్యతో 9 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. అయితే గత కొన్ని రోజులుగా భార్య, పిల్లలను లక్ష్మణ్ దూరంగా ఉంచుతున్నాడు. కరీంనగర్ జిల్లా వెంకట్రావ్ పేటకు చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనికి సంబంధించి పెద్దమనుషులు ఇరు కుటుంబాలకు సర్ది చెప్పారు. అయినా లక్ష్మణ్ తీరు మార్చుకోలేదు. విషయం తెలుసుకున్న సౌజన్య న్యాయం కోసం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల నుంచి సరైన స్పందన రాలేదు. మరో మహిళతో లక్ష్మణ్ నిజాంపేటలో నివాసం ఉంటున్నట్టు ఆమె తెలుసుకుంది. గురువారం ఉదయం వారు ఉంటున్న ఇంటికి సౌజన్య తన బంధువులతో కలిసి వెళ్లింది. ఇద్దరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని చెప్పులతో కొడుతూ దేహశుద్ధి చేసింది. నా భర్తతో నీకేం పని? అంటూ ఆ యువతికి కూడా దేహశుద్ధి చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు వారిని పీఎస్‌కు తీసుకువెళ్లి విచారిస్తున్నారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ ఎవరన్నదానిపై కూడా పోలీసులు విచారిస్తున్నారు. అయితే తనకు న్యాయం కావాలని సౌజన్య డిమాండ్ చేస్తోంది. తన కాపురంలో చిచ్చు పెట్టిన మహిళను కూడా కఠినంగా శిక్షించాలని ఆమె కోరింది. పోలీసులు కేసునమోదు చేశారు.

### ప్రముఖ కవి, సాహితీవేత్త..

## ఇంద్రగంటి శ్రీకాంతశర్మ కన్నుమూత

**- అనారోగ్యంతో బాధపడుతు మృతి**
**- సంతాపం తెలిపిన సినీ ప్రముఖులు**



హైదరాబాద్, జులై25(ఆర్ ఎన్‌ఎ) : దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి, ప్రముఖ కవి, సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంత శర్మ కన్నుమూశారు. ఆయన వయసు 75 ఏళ్లు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోన్న శ్రీకాంత శర్మ.. గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురంలో ఇంద్రగంటి శ్రీకాంత శర్మ 1944 మే 29న జన్మించారు. 1976లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరి 20 ఏళ్ల పాటు సేవలందించారు. అనేక లలిత గేయాలు, కవితలు, సాహిత్యవ్యాసాలతోపాటు రేడియో నాటికలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, సంగీతరూపకాలను రచించారు. అలాగే 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ఉప సంపాదకుడిగా, 'ఆంధ్రప్రభ' పత్రికకు సంపాదకుడిగా చాలాకాలం పనిచేశారు. పలు తెలుగు సినిమాల్లో పాటలు రాశారు. 'కృష్ణావతారం', 'నెలవంక', 'రావుగోపాలరావు', 'రెండుజెళ్ల సీత', 'పుత్తడిబొమ్మ', 'చైతన్యరథం' వంటి చిత్రాల్లో శ్రీకాంత శర్మ పాటలు రాశారు. తన కుమారుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తెరకెక్కించిన 'సమ్మోహనం' సినిమాలోనూ ఆయన పాటను రచించారు. శ్రీకాంత్ శర్మ 1966లో సుప్రసిద్ధ కథారచయిత్రి జానకీబాలను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు ఇంద్రగంటి మోహనకృష్ణ గురించి అందరికీ తెలిసిందే. కుమార్తె కిరణ్మయి కూడా డాక్యుమెంటరీ, లఘుచిత్రాలు తీసి అవార్డులు పొందారు. ఈమె మోహనకృష్ణ కంటే పెద్దవారు. కుటుంబం మొత్తం హైదరాబాద్‌లోనే నివాసం ఉంటోంది. కాగా, శ్రీకాంత్ శర్మ మృతికి సంతాపం తెలుపుతూ హీరో నాని ట్వీట్ చేశారు. తెలుగు సాహిత్య ప్రపంచంలో ఆయనొక మేధావి అని, గొప్ప వ్యక్తిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 'అష్టా చమ్మా' సినిమాను చూసిన తరవాత మోహన్ గారితో పాటు తామందరనీ చూసి ఆయన ఎంత గర్వపడ్డారో ఇప్పటికీ

మరిచిపోలేనని అన్నారు. మోహనకృష్ణ గారికి, ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే, హీరో సిద్దార్థ్ , పలువురు సినీ ప్రముఖులు ట్విట్టర్ ద్వారా సంతాపం వ్యక్తం చేశారు.

### చైనాలో విరిగిపడ్డ కొండచరియలు

# 16 మంది మృతి



బీజింగ్ , జులై 25: చైనాలో వానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాలకు వరదలు పోటెత్తాయి. కొండ చరియలు విరిగిపడుతున్నాయి. దీంతో 16 మంది మృతి చెందారు. మరో 30 మంది గల్లంతయ్యారు. గుయిజ్‌హౌ ప్రావిన్స్‌లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో 21 ఇండ్లు నేలమట్టం అయ్యాయి. ఈ ప్రమాదంలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. గాయపడ్డ 11 మందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించా రు. మరో 30 మంది గల్లంతైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. హెజ్‌గాంగ్ ఏరియాలో మరొకరు మృతి చెందారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# తెలంగాణలో తుగ్లక్ పాలన

### కొత్త భవనాల నిర్మాణాలతో డబ్బు వృధా
### ప్రజల సమస్యలు పట్టని సిఎం కెసిఆర్
### ప్రగతి భవన్ పేరుతో ప్రజల సొమ్మునీళ్లపాలు
### ఇందిరాపార్క్ ధర్నా వద్ద విమర్శలు గుప్పించిన నేతలు

హైదరాబాద్,జూలై25(ఆర్ఎన్ఎ): తెలంగాణలో తుగ్లక్ పాలన నడుస్తోందని మాజీ ఎంపి, తెలంగాణ ఐక్యవేదిక నాయకులు వివేక్ మండిపడ్డారు. పేదలకు ఇళ్లు కట్టించడం, వారికి భూములు ఇవ్వడం లాంటి పనుల పక్కన పెట్టి కొత్తగా సచివాలయం, అసెంబ్లీ కట్టాలా అని ప్రశ్నించారు. వందలకోట్లు పెట్టి ఇప్పటికే ప్రగతిభవన్ కట్టుకున్నారని అన్నారు. ఇందిరిపార్క్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ తీరుకారణంగా తెలంగాణలో సమస్యలు వచ్చాయన్నారు. ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. వందలకోట్ల ప్రజాధనం వృధా చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని విమర్శించారు. కేసీఆర్ నాలుగేండ్ల పాలనలో రూ.లక్ష కోట్లకు పైగా అదనంగా అప్పులు చేశారని అన్నారు. దళితుల మనోభావాలు దెబ్బతీసేలా అంబేద్కర్ విగ్రహాన్ని పంజాగుట్టలో తొలగించారనీ.. ప్రజా అవసరాలు పక్కకు పెట్టి ప్రగతి భవన్‌లో కేసీఆర్ నిద్రపోతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల పోరాటానికి ఇది ఆరంభం మాత్రమే అన్నారు. తెలంగాణ ఉద్యమ స్థాయిలో కెసిఆర్ నిరంకుశంపై పోరాడుతామని అన్నారు. కొత్త అసెంబ్లీ, కొత్త సెక్రటేరియట్ ఎందుకు కడుతున్నారని హైకోర్టు వేసే ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానం లేదన్నారు. కొత్త అసెంబ్లీ, కొత్త సెక్రటేరియట్ నిర్మాణంపై కూడా గవర్నర్ స్పందించాలని డిమాండ్ చేశారు. హెరిటేజ్ భవనాలను కూల్చి కొత్త సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాలు నిర్మించాలనుకుంటున్న కేసీఆర్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి డీకే అరుణ డిమాండ్ చేశారు. జనం డబ్బు వేస్ట్ చేస్తూ భవనాల నిర్మాణానికి అడుగు ముందుకేస్తే మాత్రం ప్రతిపక్షాలన్నీ ఒక్కటై ఆ కూల్చివేతలు, నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఉద్యమ ఆకాంక్షలు, ఉద్యమకారులను పక్కకు పెట్టి ఒక్క కుటుంబం కోసం పాలన చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణకు ఉపయోగపడే పని ఒక్కటి కూడా కేసీఆర్ చేయలేదన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేక నిర్ణయాలే తీసుకుంటున్నారన్నారు. చింతమడకను హరీష్ రావు కాదు? తానే అభివృద్ధి చేస్తున్నా అని చెప్పడానికి కేసీఆర్ ఆ ఊరికి వెళ్లారని డీకే అరుణచెప్పారు. ప్రజాస్వామిక తెలంగాణ వేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. తాము బందీల తెలంగాణలో ఉన్నామని, అందుకు సిగ్గుపడుతున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్ పేర్కొన్నారు. ఉద్యమంలో ఆంధ్ర నాయకులను ప్రశ్నించినట్టు ఇప్పుడు ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలపై పోలీసులు కేసీఆర్‌ను ప్రశ్నించాలన్నారు. హరీష్‌రావు వెన్నుపోటు పొడుస్తాడనే భయంతోనే కేసీఆర్ చింతమడకకు వెళ్లారని ఇందిరా శోభన్ ఆరోపించారు. కేసీఆర్ నియంతలా పాలిస్తున్నాడని, ఆయనను అధికారం నుంచి ప్రజలే తరిమివేస్తారని ఇందిరా శోభన్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామిక తెలంగాణ వేదిక ఆధ్వర్యంలో సెక్రటేరియట్ వరకు ర్యాలీని పోలీసులు ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్దే అడ్డుకున్నారు. మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా.. మరో 30 మంది నాయకులను ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్, ఆ పార్టీ ఉపాధ్యక్షుడు పీఎల్ విశ్వేశ్వర్ రావు సహా..

మరో 25 మంది నాయకులను నారాయణ గూడ స్టేషన్ కు తీసుకెళ్లారు. పోలీసుల తీరును నాయకులు తప్పుపట్టారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకు తమ పోరాటం ఆగదన్నారు.

### చరిత్రలో నేటినిజం



ఈ "కార్గిలు" నే పరిపంథులు
టూర్గిట్టును జేసినప్పుడు ఈకుక్రవారిది
భార్గవుపై ఎదిరించుచు
మార్గదొంలను చేసినారు మన సైనికులే!!

( జులై 26 కార్గిల్ విజయోత్సవం...) -రాధశ్రీ
సెల్: 9494481210

# ట్రిపుల్ తలాక్‌ను వ్యతిరేకించిన జేడీయూ




హైదరాబాద్, జులై 25: ఎన్డీఏ కూటమిలో భాగస్వామి అయిన జనతాదళ్(యూ).. ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకించింది. లోక్‌సభలో ఇవాళ ఆ బిల్లుపై జేడీయూ ఎంపీ రాజీవ్ రంజన్ మాట్లాడారు. ఈ బిల్లు ఒక వర్గ ప్రజల్లో అపనమ్మకాన్ని కలిగిస్తుందని ఆయన అన్నారు. తమ పార్టీ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం లేదన్నారు. భార్యా,భర్తల మధ్య బంధాన్ని చట్టాలతో నిర్వచించలేమని ఎంపీ రాజీవ్ తెలిపారు. ఆ వర్గానికే ఆ సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఇవ్వాలన్నారు. తక్షణ తలాక్ పద్ధతిని రద్దు చేయాలని ముస్లిం పర్సనల్ బోర్డు కోరుతోందన్నారు. ఓట్లు కోల్పోతామన్న భయంతో ప్రతిపక్షాలు ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకిస్తున్నాయని కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారమే బిల్లు ఉందన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లు... ముస్లిం మహిళలకు రక్షణగా నిలుస్తుందన్ని నక్వీ అన్నారు.

నేటి నిజం

శుక్రవారం 26-7-2019

# ఈ జీవనవాంఛ నెరవేరుతుందా?

సర్వోన్నత న్యాయస్థానం వారి అధికార పరిధి గురించి, 'రాజ్యపాల్'- గవర్నర్-కున్న విచక్షణ అధికారం గురించి కర్నాటకలోని రాజకీయవేత్తలు తమ ఇష్టం వచ్చిన రీతిలో వ్యాఖ్యానాలు చేస్తుండడం గందరగోళాన్ని మరింతగా పెంచిన విపరిణామం! సర్వోన్నత న్యాయస్థానం ఈ అధికార పరిధి గురించి చేసిన స్పష్టీకరణ కర్నాటకకు మాత్రమేకాక అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తోంది. శాసనసభ అధ్యక్షుడికి ఆదేశాలను జారీచేసే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉందని పదహారవ తేదీన స్పష్టమైంది. తమకు అనుకూలంగా సర్వోన్నత న్యాయాదేశాలు వెలువడితే రాజకీయ పక్షాలవారు 'అధికారం ఉందని' అంటున్నారు. సర్వోన్నత న్యాయాదేశాలు తమకు వ్యతిరేకమైతే 'సుప్రీం కోర్టుకు అధికారం లేదని' చెప్పడం ఈ రాజకీయ పక్షాలకు పరిపాటి అయింది. రాజకీయ పక్షాల-ప్రస్తుత కర్నాటక 'కాండ'విషయంలో కాంగ్రెస్-జనతాదళ్ కూటమివారి ఈ ద్వంద్వ వైఖరిని సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. గుర్తుపెట్టుకొంది. ఈ న్యాయస్థానం అధికార పరిధి విస్తృతి గురించి ఎలాంటి నిబంధన లేదు.

తమ సౌలభ్య పరిమితులకు అనుగుణంగా ఈ న్యాయస్థాన పరిధులను నిర్ణయించే యత్నాలు రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధం అన్నది సర్వోన్నత ప్రధాన న్యాయమూర్తి రంజన్ గగోయి పదహారవ తేదీన చెప్పిన మాట. రాజ్యాంగంలోని 142వ అధికరణం ప్రకారం సర్వోన్నత న్యాయస్థానానికి అపరిమిత అధికారాలు ఉన్నాయి. ఈ సంగతిని కూడ సర్వోన్నత న్యాయస్థానం ఇదివరకే పలుమార్లు స్పష్టం చేసింది. రాజ్యాంగపరమైన సందేహాలను నివృత్తిచేసి స్పష్టీకరణ ఇవ్వవలసిన బాధ్యత కూడ 143వ అధికరణం ప్రకారం సర్వోన్నత న్యాయస్థానానిది..!ఇలా రాజ్యాంగ నియమ నిబంధనల స్పష్టీకరణకు కర్నాటక 'రచ్చ' దోహదం చేసింది. ఇదీ ప్రధానం. ముఖ్యమంత్రి పదవిలో కుమారస్వామి కొనసాగుతాడా? లేక యెడుయూరప్ప జీవనవాంఛ నెరవేరుతుందా? అన్నది దేశ ప్రజలకు,ప్రత్యేకించి కర్నాటక ప్రజలకు ప్రధానం కాదు. ఈ ఇద్దరూ 'దొన్నూదొన్నే'. గతంలో కుమారస్వామి యెడు యూరప్పతో జట్టుకట్టాడు. 2005 వరకూ కాంగ్రెస్‌తో జట్టుకట్టిన కుమారస్వామి పార్టీ 2006 జనవరిలో కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకుంది. కాంగ్రెస్ నాయకుడు ధర్మసింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. 2004నుంచి కొనసాగిన ధర్మసింగ్ ప్రభుత్వంలో సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి. ఇతగాడు అప్పుడు 'సర్వమత సమభావ జనతాదళ్'లోనే ఉండేవాడు. కేవలం తాను ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా కుమారస్వామి ధర్మసింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టడం చరిత్ర. 2006 జనవరిలో కుమారస్వామి ముఖ్యమంత్రిగా యెడుయూరప్ప ఉప ముఖ్యమంత్రిగా జనతాదళ్-భాజపా కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఏజపా'వ్రతం చెడింది. ఇర్వై నెలలు కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉండాలని, తరువాత ఇర్వై నెలలు యెడుయూరప్ప ముఖ్యమంత్రి కావాలని ఒప్పందం కుదిరింది. ఇర్వై నెలలపాటు ముఖ్యమంత్రిగా ఉండిన కుమారస్వామి మాట తప్పాడు. ఫలితంగా 2007లో యెడు యూరప్ప ముఖ్యమంత్రి పదవి మూన్నాళ్లముచ్చటగా ముగిసింది. కానీ ఇలా వంచనకు గురైందన్న సానుభూతి కారణంగా, 2008నాటి శాసనసభ ఎన్నికలలో 'భాజపా' విజయం సాధించింది. యెద్యూరప్ప ముఖ్యమంత్రి అయ్యాడు. కానీ ఐదేళ్లలోగా ఆయన తాను భ్రష్టుపట్టి పార్టీని భ్రష్టుపట్టించడం చరిత్ర. 2013నాటి ఎన్నికలలో 'భాజపా' ఓడింది. యెద్యూ రప్ప ప్రాంతీయ పార్టీ ఓడింది. మళ్లీ 'భాజపా'లో చేరిన యెద్యూరప్పను కర్నాటక ప్రజలు మన్నించలేదు. 2018నాటి ఎన్నికలలో కర్నాటక శాసనసభలో 'భాజపా'కు స్పష్టమైన సంఖ్యాధిక్యం లభించలేదు. 224 స్థానాలున్న శాసనసభలో 105 స్థానాల దక్కాయి. ఇలా 'విజయం' చేజారడానికి కారణం భాజపా' పాలిట యెడుయూరప్ప గుదిబండగా మారడం.. ఇతనిని కాక సదానంద గౌడనో అనంతకుమార్‌నో మరొకరినో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారం చేసి ఉంటే 2018నాటి శాసనసభ ఎన్నికలలో 'భాజపా' ఘన విజయం సాధించి ఉండేది. 'సర్వమత సమభావ జనతాదళ్' నుంచి ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరిన సిద్ధరామయ్య 2013లో ముఖ్యమంత్రి కావడానికి కారణం కూడ అతని నిర్వాకమే అనడంలో ఆశ్చర్యమేముంది..?

# జూరాల వెలవెలతో ఎత్తిపోతలకు గండి

### తాగునీటికి కూడా కటకట

### తప్పదంటున్న అధికారులు

మహబూబ్‌నగర్,జూలై 25(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది జూరాల, తుంగభద్ర నిండకపోవడంతో ఆ ప్రాజెక్టులోకి నీరు చుక్క కూడా రాలేదు. వరద వచ్చినా నీటిని వాడుకునే రోజులు కచ్చితంగా తగ్గుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికితోడు ఉమ్మడి జిల్లాకు సాగునీటి వరప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ నుంచి వరద లేక వెలవెలబోతోంది. భారీ వర్షాలు నమోదై ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులు దాటితేనే జూరాల ప్రాజెక్టుకు వారం రోజుల్లో నీరు వచ్చే అవకాశం ఉంటుంది. వనపర్తి జిల్లాలో సాగునీటికి ప్రధాన వనరుగా ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఆధారంగా నడుస్తుంది.

ఎండాకాలంలో కర్ణాటక నుంచి తీసుకున్న 2.5 టీఎంసీల నీటిలో ఇంకా 1.8 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండునెలలవుతున్నా, ఎన్నడూ లేనివిధంగా జూరాల ప్రాజెక్టుకు ఈ రెండు నెలల్లో ఒక్కచుక్కనీరు కూడా రాలేదు. కర్ణాటక నుంచి తీసుకున్న నీటిలో మరో 0.8 టీఎంసీలు మాత్రమే తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతోంది. ఒక టీఎంసీ నీరున్నా దాన్ని కాలువల ద్వారా తాగునీటి అవసరాలకు తరలించేందుకు ఇబ్బందులు ఏర్పడుతాయి. ఏటా జూన్‌లోనే ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం మొదలవు తుంది. కానీ ఈ ఏడాది జూలై పూర్తికావస్తున్నా నీరు రాలేదు. ఎగువన కర్ణాటకలో వర్షాలు కురవకపోవడం, మహారాష్ట్రలో కురిసిన వర్షాలతో ఇప్పటివరకు కర్ణాటకలో ఉన్న ఆలమట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు మాత్రమే నిండే దశకు చేరుకోవడంతో దిగువకు నీరు రాక ద ఇబ్బందికర పరిస్థితులు తయారయ్యాయి. ఇప్పటికే జూరాల దిగువన ఉన్న శ్రీశైలం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో భారీగా తరలివెళ్లేది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగంతోపాటు శ్రీశైలం, నాగార్జునసాగర్‌పై ఆధారపడిన రైతులు, కృష్ణానది ఆధారంగా తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్న ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్న ప్పటికీ రబీకి క్రాఫ్ హాలిడే ప్రకటించారు. ఈసారి ఇప్పటివరకు చుక్కనీరు రాలేదు.. ఇప్పటికే ప్రాజెక్టు కింద సన్నాలు సాగుచేసుకునే రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాలు ఈ ప్రాజెక్టు ద్వారానే తీరుతున్నాయి. 15 రోజలుపాటు పరిస్థితి ఇలాగే ఉంటే తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి అవసరాలకు ఎత్తిపోతల పథకాలే ఆధారం. ఈ ప్రాజెక్టుతోపాటు ఎత్తిపోతల పథకాలన్నింటికీ కృష్ణా వరద కీలకం. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం జోగులాంబ గద్వాల జిల్లా సాగునీటి అవసరాలు తీర్చుతుంది. భీమా ఫేజ్ 1, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు సాగునీటిని అందిస్తోంది. భీమా పేజ్ 2 రిజర్వాయర్ వనపర్తి జిల్లాలో ఆయకట్టుకు నీరు అందిస్తోంది. ఇన్ని ఎత్తిపోతల పథకాలు కేవలం జూరాల ఆధారంగానే నడుస్తాయి. జూరాల ప్రాజెక్టు నిండినా ఎత్తిపోతల పథకాలకు నీరు రావడం ఇబ్బందికరంగానే తయారవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ప్రజాస్వామ్య విరుద్ధంగా మున్సిపల్ చట్టం

### విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోని సిఎం: కటకం

కరీంనగర్,జూలై25(ఆర్ఎన్ఎ): కొత్త మునిసిపల్ చట్టం ప్రజాస్వామ్య, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని డిసిసి అధ్యక్షుడు కటకం మృత్యుంజయం ఆరోపించారు. అన్ని పక్షాలను విశ్వాసంలోకి తీసుకుని మంచి ప్రయత్నం చేయాలన్న ఆలోచన సిఎం కెసిఆర్‌కు ఏనాడూ లేదన్నారు. కేవలం విపక్షాలను ఎండగట్టడం, వారిని తక్కువ చేసి మాట్లాడడమే ఆయనకు తెలుసన్నారు.

ప్రజాప్రతినిధులను కాదని కలెక్టర్లకు అధికారాలు కట్టబెట్టాలని చూడటం గ్రామస్వరాజ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. గవర్నర్ అందుకే దీనిపై భ్యంతరాలు వ్యక్తం చేశారని అన్నారు. కేసీఆర్ నిర్ణయాలు నిరంకుశ విధానాలకు నిదర్శనమని అన్నారు. ఇలాంటి నిర్ణయాలను తీసుకునే ముందుకు అఖిలపక్షం నేతలతో చర్చిస్తే బాగుండేదన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించడం సరికాదని, 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని చేశారు. బీసీలకు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయని, రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరారు. తెలంగాణలో గత 20 ఏళ్లలో ఎన్నడూలేనంత కరువు నెలకొందని, కరువు దుర్భిక్షంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి నివేదిక పంపించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని కరువుపై ప్రజాప్రతినిధులు సిఎం కెసిఆర్‌తో మాట్లాడాలని అన్నారు. భూ ప్రక్షాళన తప్పులతడకగా మారి రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అవినీతి మయమైందన్నారు.

# ఉగ్రవాద నిర్మూలనకు కఠిన చట్టాలు అవసరమే

హైదరాబాద్, జులై 25:యాదృచ్ఛికంగానే పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తమ దేశంలో 40వేలమంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నట్లు అంగీకరించిన వేళ, లోక్‌సభలో ఉగ్రవాద నిరోధక సవరణ చట్టం ఆమోదం పొందింది. ఉగ్రవాద నిరోధక చర్యలను మరింత పటిష్టంగా చేపట్టేందుకు ఈ బిల్లు ఉపయోగపడనుంది. యధాలాపంగానే ఈ సవరణ చట్టాన్ని వ్యతిరేకించిన విపక్షాలు తమ సహజ నైజాన్ని చాటుకున్నాయి. ఇకపోతే పుల్వామా దాడి తరవాత ప్రతీకార దాడి జరిపి బాలకోట్‌లో ఉన్న ఉగ్రశిబిరాలను భారత్ వాయుసేన ధ్వంసం చేసింది. ఎన్నికలకు ముందు ఈ విషయంపై రాహుల్ సహా విపక్షనేతలు అంతా మోడీ లక్ష్యంగా సర్జికల్ దాడులు చేశారు. వాయుసేన దాడిని తేలికగా కొట్టి పారేశారు. మన్మోహన్ కాలంలో ఇలాంటి దాడులు చాలానే చేశామని కాంగ్రెస్ నేతలు మన సైనికసత్తాను చిన్నది చేసేలా, పాక్‌కు వంతపాడేలా చేశారు. అయితే తరవాత ఎన్నికల ఫలితాల్లో వీరంతా గల్లంతయ్యారు. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే పాక్‌లో ఎంతమంది ఉగ్రవాదులు ఉన్నారో చెప్పిన ప్రధాని ఇమ్రాన్ ఇప్పటికైనా ప్రపంచానికి నిజాలు వెల్లడించారు. మనదేశం అనేకరకాలుగా ఆధారాలు ఇచ్చినా ఇంతకాలం బుకాయిస్తూ వచ్చిన పాక్ ఇప్పటికైనా తమ దేశంలో ఉగ్రమూకులు ఉన్నాయని అంగీకరించారు. 2014లో పాకిస్థానీ తాలిబన్లు పెషావర్‌లోని సైనిక పాఠశాలలో 150 మంది చిన్నారులను ఘోరంగా హతమార్చిన తరవాత తమ దేశంలో ఏ ముష్కర సంస్థనూ అనుమతించకూడదన్న ప్రణాళికకు అన్ని రాజకీయ పార్టీలు సమ్మతించాయని ఇమ్రాన్ చెప్పు కొచ్చారు. మిలిటెంట్ సంస్థలను నియంత్రణలోకి తీసుకుని, వాటిని నిరాయుధీకరిస్తున్న తొలి పాకిస్థాన్ ప్రభుత్వం మాదని ఇమ్రాన్ చెప్పడం చూస్తుంటే విధిలేని పరిస్థితుల్లో అమెరికా ముందు నిజం వెళ్లగక్కాడు. దీంతో ముష్కరులు, ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఆశ్రయమిస్తోందన్న ఆరోపణలు నిజమేనని తేలిపోయింది. తమ దేశంలో 40వేల మంది శిక్షణ పొందిన సాయుధ ఉగ్రవాదులు ఉన్నారని, వీరంతా కశ్మీర్, అఫ్గానిస్థాన్ లలో పనిచేసిన వారేనని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ స్వయంగా అంగీకరించారు. తమ భూభాగంలో మిలిటెంట్ సంస్థలు పనిచేస్తున్న విషయాన్ని గత ప్రభుత్వాలు అమెరికాకు చెప్పకుండా నిజాన్ని తొక్కిపెట్టి నట్టు కూడా వెల్లడిం చారు. తాలిబన్, జైష్-ఎ-మహమ్మద్, లష్కర్-ఎ-తొయిబా వంటి ముష్కర సంస్థలకు పాకిస్థాన్ ఆశ్రయ మిస్తోందని భారత్, అఎ÷-గానిస్థాన్‌లు చాలాకాలంగా ఆరోపిస్తూ వస్తున్న క్రమంలో ఖాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గత ఫిబ్రవరి 14న పుల్వామాలో భారత సైనిక వాహన శ్రేణిపై ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై అంతర్జాతీయంగా ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో ఉగ్రవాద సంస్థ జమాత్-ఉద్- దవాకు చెందిన ఆస్తులపై పాకిస్థాన్ ప్రభుత్వం దాడులు నిర్వహించింది. దీన్ని తమ ప్రభుత్వ ఘనతగా ఇమ్రాన్ ఖాన్ చెప్పుకొచ్చారు. ఎలాగైతేనేమీ పుల్వామా దాడి తరవాత పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీ యంగా మోడీ చేస్తున్న ప్రయత్నాలకు ఇప్పుడు ఇమ్రాన్ వ్యాఖ్యల ద్వారా మద్దతు లభించింది. గతంలో ఎన్నడూ లేనంతగా అంతర్జాతీయంగా పాక్‌పై ఒత్తిడి పెరగడం మన విజయంగానే చూడాలి. పక్కదేశం పక్కలో బల్లెంలా మనపైకి ఉగ్రమూకలను ఎగదోస్తున్న వేళ పాక్ ప్రధాని నిజాలు వెల్లగక్కిన రోజు...మన పార్లమెంట్ కీలకమైన చట్ట సవరణను ఆమోదించింది. ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్న వ్యక్తుల ను ఉగ్రవాదులుగా నిర్ధారించేలా చట్టానికి సవరణలు చేసేందుకు ప్రభుత్వం తెచ్చిన బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఈ సవరణలపై ప్రతిపక్షాలు వ్యతిరేకత వ్యక్తం చేయగా, ప్రభుత్వ నిర్ణయాన్ని హోం మంత్రి అమిత్ షా గట్టిగా సమర్థించడం విశేషం. ఇప్పుడున్న ప్రస్తుత పరిస్తితుల్లో చట్టాలను కఠినం చేసుకుని ముందుకు వెళ్లాల్సిన ఆవశ్యక్త ఉందని హోంమంత్రి చేసిన ప్రకటనను స్వాగతించాల్సిందే.

ఉగ్రవాదుల కన్నా దర్యాప్తు సంస్థలు నాలుగడుగులు ముందుండాలంటే ఈ సవరణలు కచ్చితంగా అవసర మేనని షా పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం 2019పై లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా మాట్లాడుతూ ఈ బిల్లుపై ఓటింగ్‌లో పాల్గొనకుండా ప్రతిపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులంతా బయటకు వెళ్లిపోవడంపై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. నిజంగా విపక్షాలకు ఉగ్రవాదుల ఏరివేతలో చిత్తశుద్ధి లేదని తేలిపోయింది. కనీసం ఇమ్రాన్ చేసిన ప్రకటన ఆధారంగా అయినా ఈ బిల్లుపై సమగ్రంగా చర్చించి చట్టాన్ని బలోపేతం చేసేందుకు తమ మద్దతు ప్రకటించాల్సి ఉంది. కానీ వారు ఎప్పటి లాగేనే వ్యవహరించాలరు. మీ ఓటు బ్యాంకును కాపాడుకోడానికి మీరు ఈ బిల్లును వ్యతిరేకి స్తున్నారని హోంమంత్రి అమిత్ షా చేసిన విమర్శలో ఇసుమంత దోషం కూడా లేదు. అలాగే సవరణ బిల్లుకు ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. ఈ చట్టానికి తెచ్చిన సవరణలను, చట్టాన్ని తాము దుర్వినియోగం చేయబోమనీ, కేవలం ఉగ్రవాదాన్ని వేళ్లతో సహా పెకలించేందుకే దీనిని ఉపయోగిస్తామని అమిత్ షా స్పష్టంగా తెలిపారు. అలాగే కొంతమంది వ్యక్తులు సిద్ధాంతాల పేరుతో పట్టణ మావోయిజాన్ని ప్రోత్సహిస్తున్నారనీ, అలాంటి వారిపై ప్రభుత్వం ఎంతమాత్రమూ దయ చూపదని కూడా అమిత్ షా స్పష్టం చేశారు. నిజానికి ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అణచివేయాలి. దేశాన్ని అతలాకులతం చేయడం, బాంబలతో దాడులు చేయడం, నిరంతరంగా మన సార్వభౌమాధికారా న్ని సవాల్ చేసే వారిని మట్టుపెట్టడం లో ఎంత కఠినంగా అయినా వ్యవహరించాల్సిందే. ఉగ్రవాద, వినాశక కార్యకలాపాల నిరోధక చట్టం' టాడా, ఉగ్రవాద నిరోధక చట్టం పోటాలకు మార్పులు చేస్తూ ఈ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక సవరణ చట్టం బిల్లులను కేంద్రం తెచ్చింది. ఉగ్రవాదానికి పాల్పడిన లేదా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్న, ఉగ్రవాద హింసాకాండకు ఏర్పాట్లు చేసిన, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినా, ఇతరత్రా సహకారం అందించిన వ్యక్తులు, సంస్థలను ఈ చట్టం కింద ఉగ్రవాదులుగా లేదా ఉగ్రవాద సంస్థలుగా కేంద్రం ప్రకటించనుంది. మొత్తంగా ఈ చట్టం ద్వారా దర్యాప్తు సంస్థలకు ప్రతిబంధకాలు తొలగనున్నాయి. మరింత కఠినంగా అణచివేతకు ఆస్కారం ఏర్పడింది.

# నిర్మల్ మున్సిపల్ ఎన్నికలపై నీడినీడలు

### వార్డుల విభజనలో అవకతవకలు

### స్టే ఎత్తేస్తేనే ఎన్నికలకు అవకాశం

### మల్లగుల్లాలు పడుతున్న అధికారగణం

నిర్మల్,జూలై25(ఆర్ఎన్ఎ): కొత్త మున్సిపల్ చట్టం అమల్లోకి వచ్చినా స్టే కారణంగా నిర్మల్ మున్సిపల్ ఎన్నికలపై నీడినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలను కాలపరిమితి ముగిసిన అన్నిచోట్ల ఆగస్టు 2వ వారంలో ఎన్నికలు నిర్వహించి తీరుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.

సీఎం ప్రకటనతో అన్ని రాజకీయపక్షాలు ఎన్నికలకు సమాయత్తమయ్యాయి. పెద్దమొత్తంలో ఫిర్యాదులు రావడం, హైకోర్టుకు వెళ్లడం వంటి కారణాలు ఎన్నికల నిర్వహణపై ప్రభావాన్ని చూపుతున్నాయి. రాష్ట్రవ్యాప్త ఎన్నికలపై ముప్పేట కొర్రీలు పడుతుండడంతో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందా అని మీమాంస నెలకొన్నది. కోర్టు ఆదేశాల మేరకు సకాలంలో వార్డుల పునర్విభజన పూర్తి చేసి, ఓటర్ల జాబితా సవరిస్తారా లేదా అన్నది ప్రశ్నగా మారింది. భైంసా మున్సిపాలిటీ ఎన్నికలపై హైకోర్టు గతంలోనే స్టే విధించిన విషయం తెలిసిందే. తాజాగా నిర్మల్ విసయంలోనూ అదే జరిగింది. పురపాలక సంఘాల ఎన్నికలకు సంబంధించి నెలకొన్న ప్రతిష్టంభన నిర్మల్ మున్సిపాలిటీకి తాకింది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల వ్యవహారంపై అనేక పురపాలక సంఘాల నుంచి ఫిర్యాదులు హైకోర్టుకు వెళ్లగా.. పూర్తిస్థాయి విచారణ జరిపిన తరువాతనే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా నిర్మల్ మున్సిపాలిటీకి సంబంధించి కూడా ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని, వార్డుల విభజన అశాస్త్రీయంగా జరిగిందంటూ నిర్మల్‌కు చెందిన కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. నిర్మల్ మున్సిపల్ ఎన్నికలపై కూడా హైకోర్టు స్టే విధించింది. పూర్తి వివరా లతో రావాలని కేసును ఈ నెల 29కి వాయిదా వేసింది. దీంతో ఈ నెలాఖరు వరకు కూడా మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రావడం కష్టసాధ్యమేనని పురపాలక శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఎన్నికలపై ఒక్కొక్కటిగా వస్తున్న ఫిర్యాదులు ఎన్నికల ప్రక్రియకు అవరోధాలుగా మారుతున్నాయన్న చర్చ జరుగుతోంది. ప్రతిపక్షాలతో పాటు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనూ ఓటర్ల జాబితా, వార్డుల విభజనపై అసంతృప్తి ఉన్న నేపథ్యంలో అసలు ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న అనుమానం మొదలైంది. నిర్మల్‌లో గతంలో 36 వార్డులు ఉండగా వార్డులను 42కు పెంచారు. ఈ క్రమంలోనే కొత్త వార్డులను విభజన అనివార్యమైంది. వార్డుల విభజన సందర్భంగా జరిగిన పరిణావాలు ఎన్నికలపై కోర్టుస్టేకు దారి తీసినట్లు చెబుతున్నారు. వార్డుల పునర్విభజన సమయంలో అధికార యంత్రాంగం సరియైన రీతిలో చర్యలు చేపట్టని కారణంగానే వార్డుల విభజన గందరగోళం అయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పాత వార్డుల్లోనూ ఉన్న ఓటర్ల జాబితా తప్పుల తడకగా తయారైందని వార్డుల వారీగా తీసుకున్న ఓటర్ల జాబితా అయోమయంగా మారిందన్న ఆరోపణల నేపథ్యంలో ఎన్నికలపై విచారణ జరపాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొంటున్నారు. నిర్మల్ పురపాలక సంఘంలో ఓటర్ల జాబితా గందరగోళం కావడానికి కారణం ముమ్మాటికి మున్సిపల్ అధికారులేనని ఫిర్యాదులు వస్తున్నాయి. పురపాలక కమిషనర్ రవిబాబు ఓటర్ల గుర్తింపు జాబితా సవరణ, వార్డుల పునర్విభజన విషయంలో అధికార యంత్రాంగంపై, ఉద్యోగులపై పూర్తిస్థాయిలో అజమాయిషీ చేయని కారణంగానే వ్యవహారం జటిలంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేక వార్డుల్లో వందలకు వందలే ఓట్లు మాయం కావడం, మరికొన్ని చోట్ల పెద్ద మొత్తంలో ఓట్లు చేరడం వంటి కారణాలు వివాదానికి కారణమయ్యాయి. బీసీల గణన విషయంలోనూ అనేక కులాలను, కొన్ని మతపరమైన ఓట్లను కూడా పెద్దమొత్తంలో బీసీలు గా చూపారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కొందరు కోర్టుకు ఎక్కిన ట్లు, పరిశీలించిన కోర్టు ఎన్నికలపై తాత్కలికంగా స్టే విధించినట్లు ప్రచారం జరుగుతున్నది.

# జగిత్యాలలో పెరిగిన ట్రాఫిక్ సమస్యలు

### ఈ-చలానాలతో వాహనదారుల అడ్డదారులు

జగిత్యాల,జూలై 25(ఆర్ఎన్ఎ): జగిత్యాల పట్టణం జిల్లా కేంద్రంగా మారి మూడు సంవత్సరాలు గడుస్తుంది. దీంతో ప్రజలు నిత్యం ఏదో ఓ పనిమీద పట్టణానికి రావడంతో రద్దీ పెరగుఉతోంది. నేటికీ రహదారులు జిల్లా స్థాయికి అనుగుణంగా మారకపోవడం ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు జిల్లాలోని 18 మండలాల నుంచి నిత్యం జిల్లా కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు వస్తుండటంతో వేలాది వాహనాలు జిల్లా కేంద్రంగుండా రాకపోకలు సాగిస్తున్నాయి. తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నప్పటికీ ఆ దిశగా ప్రభుత్వం రహదారులను వెడల్పు చేయలేదు. దీనికితోడు పోలీస్ శాఖ నిబంధనలను కఠినతరం చేసింది. జగిత్యాల పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు ఉదయం, సాయంత్రం వేళల్లో చేతిలో డిజిటల్ కెమెరాలు పట్టుకుని నిబంధనలకు విరుద్ధ ంగా నడిపే ద్విచక్ర వాహనాల ఫోటోలు తీస్తూ జరిమానాలను ఈ-ఛాలన్ రూపంలో విధిస్తున్నారు. అయితే ద్విచక్ర వాహనాలు నడిపేవారికి నిబంధనలు పూర్తి స్థాయిలో తెలియకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. చలాన్ వచ్చేంతవరకు తాము ఈ తప్పు చేశామా అనే ఆలోచలో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు డివిజటల్ కెమెరాలతో వెనుక నుంచి మాత్రమే ఫొటోలు తీస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న వాహన చోదకులపై ఉక్కుపాదం మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. ఈ-ఛాలన్ పేరుతో జరిమానాలు విధించేలా చర్యలు చేపట్టింది. దీంతో వాహనదారులు బెంబేలు పడుతున్నారు. ఒక్క జగిత్యాల పట్టణంలోనే నిత్యం 350కి పైగా చలాన్‌లు విధించడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు నడిపేవారికి నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించ కుండానే ఛాలన్‌లు విధించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. అత్యవసర సమయాల్లో వాహనదారులు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న సమయంలో వారికి తెలియకుండానే ఈ-ఛాలన్ రూపంలో జరిమానా వస్తుంది. చేసేదేమీ లేక కొంత మంది నెంబర్ ప్లేట్లను తొలగిస్తుండగా, మరికొంత మంది నెంబర్ ప్లేట్‌లో ఉన్న అక్షరాల్లో కొన్నింటిని తొలగిస్తున్నారు. మరికొంత మంది పూర్తిగా అక్షరాలు కనబడకుండా చర్యలు చేపడుతూ ఈ-ఛాలన్ జరిమానాలు పడకుండా జాగ్రత్త పడుతున్నారు.ట్రాఫిక్ పోలీసుల కఠిన నిబంధనల నుంచి తప్పించుకునేందుకు చేసేదేమీ లేక తప్పులు చేస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. తప్పని తెలిసినప్పటికీ ఈ-ఛాలన్ కఠిన నిబంధనల నుంచి తప్పించుకుంటున్నట్లు పలువురు బాధితులు పేర్కొంటున్నారు.

# మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

కొత్తగూడెం,జూలై25(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని జిల్లా అటవీ అధికారులు పిలుపునిచ్చారు. తమవంతుగా అన్ని ప్రాంతాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని కొనసగిస్తున్నామని అన్నారు. హరితహారం సామాజిక బాధ్యత అని అన్నారు. మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ తరహాలోనే తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు అన్నివర్గాలవారు సహాకరించాలని కోరారు. భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతి, నీడను అందించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఊరూరా మొక్కలు నాటి పచ్చదనంతో కళకళలాడాలని, హరితహారంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని అన్నారు. గ్రామాలలోని రైతులకు మొక్కలను అందించి నాటించాలని సూచించారు. దీంతో హరితహారం లక్ష్యాన్ని అధిగమించగలుగుతామని అన్నారు. మొక్క నాటిన ప్రతి వ్యక్తి అది చెట్టులా ఎదిగేంత వరకు దాని పూర్తి సంరక్షణ భాధ్యత తీసుకోవాలని, అప్పుడే హరితహారం విజయవంతం అవుతుందని అన్నారు.

# మీ-సేవలో మరింత పారదర్శకత

### సబ్ కాంట్రాక్ట్‌కు ఇవ్వకుండా పక్కాగా చర్యలు
### రేషన్ డీలర్లకు అదనపు ఆదాయం సమకూర్చే పథకం

హైదరాబాద్,జూలై25 (ఆంఎన్‌ఎ): నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మీసేవ నిర్వహణకు అనుమతిస్తే మీసేవ కేంద్రం దక్కించుకున్న పలువురు దీనిని దందాగా సాగిస్తున్నారు. తమ స్థానాల్లో ఇతరులకు మీసేవ కేంద్రాలను అప్పగించి ప్రభుత్వం ఇచ్చే కమిషన్ తమకు అదనంగా వచ్చే ఆదాయం వర్కర్లకు అన్నట్లు సాగిన దందాకు అధికార యంత్రాంగం చెక్ పెట్టనుంది. మీ సేవ కేంద్రాల్లో అదనపు వసూళ్లను అరికట్టేలా ప్రతి మీ సేవ కేంద్రంలో టోల్ ఫ్రీ నెంబరుతో పాటు జిల్లా అధికారుల ఫోన్‌నంబర్లను ప్రదర్శించేలా కొత్త నిబంధనలను ప్రవేశపెట్టారు. ఈ బోర్డుపై టోల్ ఫ్రీ నెంబరుతో పాటు, జిల్లా మీసేవ కేంద్రాల పర్యవేక్షణాదికారి, జాయింట్ కలెక్టర్‌ల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. ఈ మీసేవ కేంద్రాల్లో ఇకపై ఫింగర్ ప్రింట్ ద్వారనే లాగిన్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. దీంతో మీసేవ ఒరిజినల్ నిర్వాహకులు మాత్రమే తమ ఫింగర్ ప్రింట్‌తో మీ సేవ కేంద్రాన్ని లాగిన్ చేయాల్సి ఉంటుంది. దీని కోసం ఆగస్టు 15వ తేదీ వరకు మీ సేవ కేంద్రాలు లాగిన్ అయ్యేందుకు ఓటీపీ సౌకర్యం కల్పించిన అధికారులు ఆ తర్వాత మాత్రం ఎవ్వరి పేరిట మీ సేవ కేంద్రం ఉంటే వారే లాగిన్ అయ్యేలా చర్యలు చేపట్టింది. దీంతో నిర్వాహకుల్లో జవాబుదారి తనం పెరిగి ప్రజలకు అందించే సేవల్లో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించాలనే ఆలోచనతో ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు సామాన్యులకు మరింత అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఒకరి పేరిట ఉన్న మీ సేవ కేంద్రాన్ని మరొకరు నడుపడం... దాని కోసం మీ సేవ కేంద్రాల్లో వర్కర్లను పెట్టుకుని వారి జీతభత్యాల కోసం ప్రజలపై అదనపు చార్జీలు వసూలు చేయడం జరుగుతోంది.

ఇదేమని ప్రశ్నిస్తే ప్రభుత్వం ఇచ్చే కమిషన్‌తో మా అందరి జీతాలు ఏలా సరిపోతాయని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. ప్రబుత్వం తీసుకున్న చర్యల కారణంగా ఇకపై ఇలాంటి అక్రమాలకు చెక్ పడనుంది.

ఆగస్టు 16 తేది నుంచి ఇందుకు శ్రీకారం చుట్టనుంది. మీ సేవ కేంద్రాల్లో డిజిటల్ హాజరు ప్రవేశపెట్టనుంది. ఇందుకుగాను మీ సేవ కేంద్రాల్లో బయో మెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తేనుంది. ఇటు మీ సేవ కేంద్రాలను పటిష్ఠ పరుస్తున్న ప్రభుత్వం ప్రజలకు డిజిటల్ సేవలను మరింత చేరువ చేసేందకు రేషన్ డీలర్లకు ఆదాయం పెంపొందించేందుకు ఆరు రకాల ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తేనుంది. ఈ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చే ముందు ఆయా రంగాల్లో రేషన్ డీలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాల వారీగా ఈ శిక్షణ ఇవ్వనున్నారు. రేషన్ షాపుల్లో ఈపాస్ యంత్రం ద్వారా బయోమెట్రిక్ విధానం ప్రవేశ పెట్టడంతో గగ్గోలు పెట్టిన రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఓ శుభవార్త చెప్పింది. రేషన్ సరుకుల పంపిణీ కోసం డీలర్లకు అందించిన ఈపాస్, ఐరిష్ యంత్రాలను ఉపయోగించి ఆన్‌లైన్ సేవల కోసం రేషన్ డీలర్ల సేవలను వాడుకునేందుకు సన్నద్ధం అవుతోంది. ఇందుకోసం వీరికి కమిషన్ రూపంలో ప్రోత్సాహకాలు అందించి ఆదాయం పెంపొందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇందుకోసం 'టీ వాలెట్'ను రేషన్ షాపుల్లోని ఈపాస్ యంత్రాల్లో అనుసంధించడానికి మీసేవ కమిషనర్ అంగీకరించడంతో ఇకపై రేషన్ షాపుల్లో ఆరురకాల ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మొబైల్ రీ చార్జింగ్, బ్యాంకు ఖాతాకు డబ్బుల బదిలీ (ఐఎంపిఎస్) డీటూహెచ్, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ప్రయాణం, బస్‌టికెట్ బుకింగ్, ఇంటర్నెట్ సర్వీస్ చెల్లింపులు, వసూళ్లు, ఆధార్‌చెల్లింపు లాంటి ఆరురకాల ఆన్‌లైన్ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా శిక్షణ ప్రారంభమైంది. ఇది అక్టోబరు 25వ తేదీన ముగియనుంది. ఈ శిక్షణ పూర్తి కాగానే రేషన్ షాపుల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానుండడంతో ఫ్లలే ప్రజలకు డిజిటల్ సేవలు ఇక సులభతరం కానున్నాయి.

# గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు

### గిరిజన ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక

ఆదిలాబాద్,జూలై25(ఆర్‌ఎన్‌ఎ): తండాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రజలు గంజాయి పంట సాగును చేపడితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా పోలీస్ అధికారులు హెచ్చరించారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు. గంజాయితో సమాజాన్ని కలుషితం చేయవద్దన్నారు. అలా చేస్తే జైలుకు వెళ్లక తప్పదన్నారు. ఇకపోతే ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ఉపాధి పొందాలని సూచించారు. గంజాయి దుష్పరిణామాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గంజాయి సాగుకు ప్రభుత్వం నుంచి అనుమతి లేదన్నారు. రైతులు గంజాయి సాగు చేసినా, ఎగుమతి, దిగుమతి చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయితో తీవ్ర అనర్థాలు ఏర్పడుతాయని, వాటికి బానిసై ఎందరో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి మహమ్మరికి దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చుకునేందుకు పాడి పరిశ్రమపై మొగ్గు చూపాలన్నారు. ప్రతి రోజూ మంచి ఆదాయం సంపాదించవచ్చున్నారు. స్త్రీనిధి, బ్యాంకు రుణాలను ఒంటరిగా కాకుండా సామూహికంగా తీసుకొని వ్యాపారం చేస్తే అధిక లాభాలు గడించవచ్చని సూచించారు. గ్రామాల్లో ఐకేపీ సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంఘాల్లో లేని మహిళలను సంఘ సభ్యులుగా చేర్చుకోవాలన్నారు.

## సంగారెడ్డి వార్తలు

# సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్న దక్కన్ సొసైటీ

### ఏటేటా పెరుగుతున్న రైతుల సంఖ్య

సంగారెడ్డి,జూలై25(నేటినిజం ప్రతినిధి): సేంద్రియ సాగుకు ముందుకు వచ్చే వారికి అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఈ తరహా వ్యవసాయానికి ఆర్థిక చేయూతను ఇస్తోందన్నారు. చిరుధాన్యాలను కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడే సేంద్రియ సాగుకు దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంస్థ చేస్తున్న కృషి గొప్పదని అన్నారు. పర్యావారణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యరక్షణకు ఇది ఎంతో ముఖ్యమని అన్నారు. రైతులు ఈ రకమైన సాగుకు మళ్లీ అలవాటు పడాలన్నారు.

సేంద్రియ ఎరువుల తయారు శ్రమతో కూడుకున్నప్పటికీ మహిళలు ఓర్పుతో కృషిచేయడం, ఇందుకు అవసరమన్నారు. వారి పిలుపును అందుకుని రైతులంతా సేంద్రియ సాగుకు ముందుకు రావాలని అన్నారు. జహీరాబాద్ లో జరిగిన పాతపంటల జాతరలాంటివి జిల్లాలో అనేక చోట్ల జరగాలని,రైతులను చైతన్యం చేయాలన్నారు. గత రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న పాతపంటల జాతర ఎందరో రైతులను చైతన్యవంతులను చేసిందన్నారు. ముఖ్యంగా సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుకు తీసుకొస్తుందన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు, పోషక విలువలున్న చిరుధాన్యాల వంటకాలతో హోటల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి శ్రేయస్కారమన్నారు. ఇదిలావుంటే అన్ని గ్రామాల్లో రైతులు తమ పొలం గట్లపైన తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లో నర్సరీలు పెంచామని వాటిలో మొక్కలు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అన్ని గ్రామాలలో రైతులు తమ పొలాలకురెండు వైపులా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. హరితహారంలో నిర్లక్ష్యం చేస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## నేడు కార్గిల్ అమరవీరుల దినోత్సవం

సంగారెడ్డి,జూలై25(నేటినిజం ప్రతినిది): ఈనెల 26వ తేదీన కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.దశరథ్, జి.పోచయ్య ఒక ప్రటనలో తెలిపారు. దేశ రక్షణ కోసం సైనికులు కార్గిల్‌లో పోరాడి విజయం సాధించారని కొనియాడారు. దేశం కోసం పోరాడి అశువులు బాసిన వీరజవానుల సేవలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించాలన్నారు. ఈ నెల 26వ తేదీన నిర్వహించే కార్గిల్ విజయ్ దివస్‌కు ముఖ్యఅతిథులుగా కలెక్టర్ హనుమంతరావు, ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీఈవో విజయలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. కార్గిల్ డేకు జిల్లాలోని మాజీ సైనికుల కుటుంబ సభ్యులు, సైనికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# కర్నాకటంలో అందరూ పాత్రధారులే

### రాజకీయ పరిణతి చూపించలేకపోయిన కుమార
### చాపకింద నీరులా పావులు కదిపిన సిద్దూ

బెంగళూరు,జూలై 25(ఆర్ఎపన్ఎ): కర్నాటకానికి ఇంకా తెరపడలేదు. కేవలం కుమారస్వామి నేతృత్వంలోని జెడిఎస్, కాంగ్రెస్ కూటమి మాత్రమే అధికారం నుంచి వైదొలగింది. తదుపరి ప్రభుత్వం యెడ్యూరప్ప ఏర్పాటు చేస్తారా అందుకు తగ్గ బలం ఉందా అన్నది ముఖ్యం. కర్నాటక వ్యవహారంలో చాపకింద నీరులా కాంగ్రెస్ పార్టీ సొంతనేతలే అక్కడి కుమార స్వామి ప్రభుత్వాన్ని కూలదోయడానికి బాగా పనిచేశారు. వ్యూహాత్మకంగా విజయం సాధించారు. తమకు లేని అధికారం కుమారస్వామికి ఎందుకన్న రీతిలో మాజీ సిఎం సిద్దరామయ్య బాగానే స్కెచ్ వేసి సక్సెస్ అయ్యారు. ఇక్కడ అసలుసిసలు విజేత సిద్దరమయ్య అనడంలో సందేహం అసవరం లేదు. అలాగే రాజకీయ పరిణతి చూపి సమస్యను పరిస్కరించుకే చతురతను కుమారస్వామి చూపలేక చతికిల పడ్డారు. బీజేపీకి అధికారం దక్కరాదనే ఏకైక లక్ష్యంతో గతేడాది మే 13న కాంగ్రెస్-జేడీఎస్ ఒక్కటయ్యాయి. ఆ ప్రయత్నంలో తొలుత విజయం సాధించినా సంకీర్ణ ప్రభుత్వం కుదురుకోకపోవడానికి కారణం నిత్యం కీచులాటలే! ఈ పొత్తు అసలే ఇష్టం లేని మొదటి వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య. అని చెప్పకతప్పదు. ఒకప్పుడు దేవెగౌడకు నమ్మినబంటైన ఆయన కాలక్రమేణా ఆయనకు ఆగర్భ శత్రువై- కాంగ్రెస్‌లో చేరి సీఎం గద్దెనెక్కి ఐదేళ్లు పాలన సాగించారు. అలాంటి సిద్ధూ తన ప్రబల శత్రువుకు అధికారం పంచివ్వడానికి ససేమిరా అన్నా ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఆయనను ఒప్పించారు. వారి కోసం ఒప్పుకున్నప్పటికీ- ఎప్పటికప్పుడు కుమారకు వ్యతిరేకంగా అసమ్మతిని రేపుతూనే వచ్చారు. మొదట మంత్రిత్వ శాఖల విషయంలో రగడ మొదలు పెట్టారు. ఇదంతా ఎందుకు రాజీనామా చేసిన వారంతా సిద్ధూ నమ్మిన బంటులే కావడం గమనించాలి. అందుకే కాంగ్రెస్ తన ఎమ్మెల్యేలను కాపాడలేదని కుమారస్వామి అసెంబ్లీ వేదికగా గట్టిగానే అన్నారు. అంతెందుకు నిత్యం గొడవల కారణంగా ప్రతీ రెండు రోజులకోసారి రాహుల్‌గాంధీకి కుమారస్వామి ఫోన్ చేయడం, ఆయన కేసీ వేణుగోపాల్ చేత మాట్లాడించడం... ఇలా కుమార ప్రభుత్వం దినదినగండంగా సాగింది. కుమార ప్రభుత్వం ఎక్కువకాలం ఉండదు, మరో రెండునెలలంతే.. అని తనకు విధేయులైన కొందరు ఎమ్మెల్యేలతో సిద్ధరామయ్య వ్యాఖ్యానించిన వీడియో కూడా వైరల్ అయింది. నాకు క్షణం మనశ్శాంతి లేదు.. అని స్వయానా కుమారస్వామి వాపోవడం, పలుమార్లు కన్నీరు పెట్టుకోవడం కూడా జరిగాయి. శివుడు గరళాన్ని మింగినట్లు అన్నీ భరిస్తున్నానని చెప్పడం కూడా సమస్యపరాకాష్టకు చేరిందని గుర్తించాలి. కనీసం మూడు సందర్భాల్లో ఆయన రాజీనామా హెచ్చరిక చేశారు. చివరకు లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా సంకీర్ణ భాగస్వామ్య పక్షాల మధ్య చిచ్చు రేగింది. మండ్య సీటు జేడీఎస్‌కు వదలడం ఇష్టంలేని కాంగ్రెస్ అక్కడ దేవెగౌడ మనవడికి వ్యతిరేకంగా, సుమలతకు అనుకూలంగా ప్రచారం జరిపింది. ఆ ఎన్నికల్లో బీజేపీ అఖండ మెజారిటీ సాధించగా, కాంగ్రెస్ ఒకే ఒక్క సీటుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. చివరకు ఈ ఎన్నికలే కుమార భవితను తేల్చేశాయి. ఎన్నికల అనంతరం తిరుగుబాట్లను తట్టుకోలేక ఆయన కుటుంబంతో కలిసి అమెరికా వెళ్లారు. అదే సమయంలో బీజేపీ... రెబెల్స్‌ను ఉసిగొలిపి ఆయన కుర్చీని లాగేసుకుంది. మొత్తంగా పదిహేనురోజులుగా సాగుతున్న కర్నాటకానికి తెరపడింది. ఇప్పుడు బిజెపి తన ఖాతాలో కర్నాటకను వేసుకోబోతోంది.

# కర్నాటకం తరవాత ఉత్తర భారతం

### జాబితాలో మధ్యప్రదేశ్,రాజస్థాన్
### ఇక్కడా పతనం తప్పదంటున్న నేతలు

భోపాల్,జూలై 25(ఆంఎపన్ఎ): పద్నాలుగు నెలల కర్ణాటక సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత మరో కాంగ్రెస్ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌పై కమలనాథులు దృష్టి సారించనున్నారా? అంటే ఔననే సమాధానం వస్తోంది. ఇటీవల వరుసగా కాంగ్రెస్ నేతలు ఇదే విసయాన్ని ప్రస్తావిస్తున్నారు. కర్నాటక వ్యయహారంతో ఇది సద్దు మణగదని, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లతో మగుస్తుందని అంటున్నారు. ఈ రెండు రాస్రాల్లో కూడా బొటాబొటి మెజార్టీతో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టింది. దీనికితోడు కమలనాథ్, అశోక్ గెహ్లాట్ పాలనపై సొంత కాంగ్రెస్‌లోనే వ్యతిరేకత ఉంది. ఇక్కడ ఇద్దరు వృద్ధ నేతలను అధికారంలోకి తసీఉకుని రావడంపై కాంగ్రెస్ యఉవనేతలు అగ్రహంగా ఉన్నారు. రాహుల్ అస్త్ర సన్యాసం కూడా ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి భరోసా లేకుండా పోయింది. రాహుల్ వైదొలగినా మరో సమర్థ నేతను పార్టీ అధ్యక్షుడిగా పెట్టుకోలేని దౌర్భాగ్యంలో ఆ పార్టీ ఉంది. అందుకే కర్నాటక తరవాత ఇప్పుడు మధ్యప్రదేశ్,రాజస్థాన్‌లలో ప్రభుత్వాలు కూలడానికి సిద్దంగా ఉన్ఆనయన్న ప్రచారం ఊపందుకుంది. ప్రజల్లో కూడా ఇదే విసయంపై చర్చ సాగుతోంది. దీనికి మధ్యప్రదేశ్ మంత్రి, కాంగ్రెస్ నేత జీతూ పట్వారీ కూడా అవుననే చెబుతున్నారు. విశ్వాసపరీక్షలో కర్ణాటక ప్రభుత్వం కుప్పకూలిన అనంతరం పట్వారీ మీడియాతో మాట్లాడుతూ, కర్ణాటక లాగానే ఇక్కడ కూడా తమ సర్కార్‌కు ఎన్నివిధాల చిక్కులు కల్పించాలో అన్ని రకాలుగా బీజేపీ చిక్కులు కల్పిస్తూనే ఉంటుందని, అయితే ఇక్కడున్నది కమల్‌నాథ్ ప్రభుత్వమని, కుమారస్వామి ప్రభుత్వం కాదని ఆయన అన్నారు. అయితే పైకి మేకపోతు గాంభీర్యం కనిపిస్తున్నా కమలనాథ్ కూడా మలూల్యం చెల్ఇంచుకోక తప్పదన్న సంకేతాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కాగా, మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ సీనియర్ నేత, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తోసిపుచ్చారు. 'ఇక్కడి ప్రభుత్వం కూలిపోతే అందుకు మేము ఎంతమాత్రం కారణం కాబోము. ప్రభుత్వాలు పడిపోతే అది కాంగ్రెస్ స్వయంకృతమే అవుతుంది. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలున్నాయి. ఎన్.పి, బీఎస్‌పీ మద్దతుతో ప్రభుత్వం నడుస్తోంది. అంతర్గత విభేదాలు ముదిరి ఏదైనా జరిగితే అందుకు మా బాధ్యత ఏమీ ఉండదు' అని చౌహాన్ అన్నారు. ఆయన అనడం ఎలా ఉన్నా అక్కడ ఎస్పీ,బిఎస్పీలు ఇప్పటికే కమలనాథ్‌ను బెదరిస్తున్నారు. రాజస్థాన్‌లోనూ గెహ్లాట్ తీరుపై స్వయంగా రాహుల్ అసంతృప్తిగా ఉన్నారు. ప్రజలు కూడా వీరి పాలనపట్ల సంతృప్తిగా లేరు. మొత్తంగా ఈ రెండు రాష్ట్రాలకు కూడా ఎప్పుడో ముహూర్తం పడదం ఖయాంగా కనిపిస్తోంది.

# రైతులను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్: ముత్తిరెడ్డి

జనగామ,జూలై25(ఆర్‌ఎన్‌ఎ): కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన తీరును రైతులే చెబుతారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. వారిపట్ల మొసలి కన్నీరు కార్చినంత మాత్రాన నమ్ముతారని అనుకోవడం మూర్ఖత్వమే అన్నారు. రైతుల వెనుకబాటుకు కారణమైందని కాంగ్రెస్ అని, పదేళ్ల పాలనలో వారిని సర్వనాశనం చేవారని అన్నారు. కెసిఆర్ వచ్చాక, తెలంగాణ ఏర్పడ్డ తరవాతనే రైతులకు స్వర్ణయుగం మొదలయ్యిందన్నారు. రైతులకు 24గంటల కరంటు, సాగునీరు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో కాంగ్రెస్ పార్టీ ఉనికిని కోల్పోతోందని అన్నారు. పలు గ్రామాల చెరువులకు వారంలోగా గోదావరి జలాలు విడుదల చేస్తామని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తెలిపారు. ఒకప్పుడు కరువుతో ఉన్న పల్లెలు ఇప్పుడు గోదావరి జలాల రాకతో కళకళలాడుతున్నాయ ని అన్నారు. ప్రతీ గ్రామంలో ఉన్న కాలువలను ఆ గ్రామానికి చెందిన రైతులు బాగు చేసుకుంటే నీరు త్వరగా వస్తుందన్నారు. ప్రతీ చెరువును గోదావరి జలాలతో నింపడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు ఆ దిశగా కాలువలను శుభ్రం చేసుకోవాలన్నారు. గోదావరి నీరు వస్తోందని తెలియడంతో రైతులు సంతోషపడుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ వచ్చాక ప్రతీ పల్లెలో ఎక్కడ చూసినా పచ్చటి పొలాలు కనబడుతున్నాయని పేర్కొన్నారు.

# విద్యార్థులే హరితహార సారధులు

ఆదిలాబాద్,జూలై25(ఆర్‌ఎన్‌ఎ): ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్‌కు అనుబంధంగా 2002లో ఆవిర్భవించి నిత్య చైతన్యంతో విద్యార్థి లోకాన్ని ఒక్కటిగా చేసిన ఘనత టీఆర్‌ఎస్‌వీదేనని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. టీఆర్‌ఎస్‌వీలో విద్యార్థులు సభ్యత్వం తీసుకొని ముఖ్యమంత్రి కలలుగన్న బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగం పంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో వీరు భాగస్వాములు కావాలన్నారు. ప్రధానంగా సిఎం కెసిఆర్ చేపట్టిన హరితహారంలో భాగస్వాములు కావాలన్నారు. చెట్లతోనే పర్యావరణం సమతుల్యతతో పాటు జీవకోటి మనుగడ సాధ్యమని అన్నారు. ప్రతి విద్యార్థి వారివారి ఇంటి ఆవరణలో కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావలని పిలుపునిచ్చారు. మండలంలో ఇప్పటి వరకు నాటిన మొక్కల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# దిక్కుతోచని స్థితిలో మాయావతి

### యూపిలో మళ్లీ పాగా వేసేందుకు యత్నాలు

లక్నో,జూలై25(ఆర్‌ఎన్‌ఎ): యూపిలో ఓటమి తరవాత మాయావతికి దిక్కుతోచకుండా పోయిందన్నది తాజా పరిణామాలను గమనిస్తే అర్థం చేసుకోవచ్చు. బిఎస్పీ అధినేత దివంతగా కాన్షీరమ్ దళిత ఉద్దరణ పథం నుంచి పక్కకు పోయిన మాయావతి రాజకీయలబ్ది లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలు బెడిసి కొడుతున్నాయి. యూపిలో వరుసగా ఓటమి చెందడం కారణంగా ఇక ఆమె రాజకీయ జీవితాన్ని ప్రశ్నార్థకం చేసింది. దీంతో మరో ఐదేళ్ల వరకు ఆమె రాజకీయ శూన్యతతో గడపాలి. తనకున్న రాజ్యసభ పదవి కూడా లేకుండా పోయింది. ఈ దశలో యూపిలో దళితులపై దాడులను బూచిగా చూపి పబ్బం గడుపుకునే యత్నాలకు దిగుతున్నారు. ఇదంతా ఓ పద్దతి ప్రకారం, వ్యూహం ప్రకారంగానే చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. రాజకీయంగా ఆమె ఏ మేరకు లబ్ది చేకూర్చనుందన్నది తరవాతి రోజుల్లో మాత్రమే తెలుస్తుంది. దళితులకు సంబంధించి కేంద్రంలోని మోడీ సర్కార్ చిన్నచూపు చూస్తోందని మొత్తం దళిత వర్గాలకు సంకేతాలు వెళ్లే విధంగా రాజకీయ ఎత్తుగడలో భాగంగానే ఆమె కార్యక్రమాలు చేశారు. అయితే మొన్నటి ఎన్నికల్లో అవేమీ ఫలించలేదు. ఎస్పీతో పొత్తు కూడా బెడిసింది. దీంతో ఇక వచ్చే అసెంబ్లీ ఎన్ఇనకల వరకు వేచిచూడాక తప్పదు. ఈలోగా పునాదులు వేసుకునే పనిలో పడ్డారు. ప్రస్తుత రాజకీయాల్లో మోడీని ఢీకొనాలంటే మళ్లీ దళిత వాదాన్ని ముందుకు తీసుకుని రావాలని మాయావతి భావిస్తున్నారు. కాన్షీరామ్ ఆలోచనలకు అనుగుణంగా మళ్లీ పార్టీని పునరుత్తేజం చేయాలని చూస్తున్నారు. నిజానికి కాన్షీరామ్ విధానాలను పక్కకు పెట్టి , కేవలం అధికార యావతో రాజకీయాలు నడపడం వల్లనే ఆ పార్టీ దెబ్బతింటూ వస్తోంది. ఇది గమనించిన మాయావతి మళ్లీ అందుకోసం క్షేత్రస్థాయి పోరాటం చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందుకే గత కొంతకాలంగా ఎన్నికల్లో వరుస ఎదురు దెబ్బలతో కాస్తా వెనుకబడినట్టు కనిపించిన మాయావతి దేశ రాజకీయాల్లో మళ్ళీ కీలకంగా మారే విధంగా ప్రణాళికలు రచిస్తున్నారు.

# మొక్కలు విరివిగా నాటాలి

మహబూబ్‌నగర్,జూలై25(ఆర్‌ఎన్‌ఎ): భావితరాల మనుగడ కోసం ప్రతీ ఒక్కరూ విస్తృతంగా మొక్కలు నాటాలని అటవీ అధికారులు అన్నారు. అంతరించిపోతున్న అడవులను రక్షించడంతో పాటు మొక్కలను విస్తృతంగా నాటి పర్యావరణహితాన్ని కాంక్షిస్తూ సీఎం కేసీఆర్ తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. హరితహారం వల్ల మంచి ఫలితాలు వస్తున్నా యన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలనే కార్యక్రమం చేపట్టామన్నారు. బంగారు తెలంగాణ సాధనలో చేస్తున్న కృషి ప్రతీ ఒక్కరికీ ఆదర్శప్రాయంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పుట్టిన రోజున మొక్కలు నాటే సంప్రదాయాన్ని ఆనవాయితీగా మొదలు పెడితే పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ సమతుల్యతకు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్నారు.

# దయతో ఇంతకాలం రాజ్యసభలో గడిపా

### వీడ్కోలు ప్రసంగంలో అన్నాడిఎంకె ఎంపి మైత్రేయన్ కంటతడి

న్యూఢిల్లీ,జులై25(ఆర్‌ఎన్‌ఎ): పదవీవిరమణ చేసిన రాజ్యసభ సభ్యుడు,అన్నాడీఎంకే సీనియర్ ఎంపీ వి.మైత్రేయన్ బుధవారంనాడు రాజ్యసభలో కంటతడి పెట్టారు. బుదశారంతో ఆయన పదవీకాలం ముగుస్తోంది. ఈ సందర్భంగా ఆయన వీడ్కోలు ప్రసంగం చేస్తూ, తనకు ఇంత గౌరవం కల్పించిన అమ్మకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. తమిళనాట అమ్మగా అందరి ఆదరాభిమానాలు చూరగొన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితను గుర్తు చేసుకుంటూ ఆయన కంటతడి పెట్టారు. పదవీ విరమణ చేస్తున్న ఈ తరుణంలో నా ప్రియతమ నేత అమ్మకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అమ్మ నా మీద ఎంతో నమ్మకం ఉంచి మూడు సార్లు రాజ్యసభకు పంపారు. అన్నాడీఎంకే నుంచి అలాంటి గౌరవం దక్కిన ఏకైక నేతను తానే అని వెల్లడించారు. ఆమె పట్లతననాకున్న విధేయత ఎల్లకాలం అలాగే ఉంటుందంటూ మైత్రేయన్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రధాని మోదీ, మాజీ ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి సైతం మైత్రేయన్ కృతజ్ఞతలు తెలిపారు. అరుణ్ జైట్లీ తనను ఒక సోదరుడిలా చూస్తూ, మార్గదర్శిగా నిలిచారని, ఆయనకు పూర్తి స్వస్థత చేకూరి తనలాంటి ఎందరికో మార్గదర్శకంగా నిలవాలని కోరుకుంటున్నానని అన్నారు. 1990 నుంచి ప్రధాని మోదీ తనకు తెలుసునని, ఆయన తన చిరకాల మిత్రుడని, ఆయనకూ, అమ్మకు మధ్య విశ్వసనీయ రాయబారిగా తాను వ్యవహరించానని చెప్పారు. ప్రధాని తన పట్ల చూపిన ఆదరాభిమానాలను ఎన్నటికీ మరచిపోలేనని మైత్రేయన్ అన్నారు.

# సిద్దిపేటలో ఆధునిక హజ్ హౌజ్

### ప్రారంభించిన మంత్రి మహ్మూద్ అలీ

సిద్దిపేట,జులై25(ఆర్‌ఎన్‌ఎ): తెరాస మాత్రమే నిజమైన లౌకికవాద పార్టీ అని తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. రాష్ట్రంలో ముస్లింలు గర్వంగా, ఆత్మాభిమానంతో బతుకుతున్నారని చెప్పారు. సిద్దిపేటలో రూ.3 కోట్లతో నిర్మించిన హజ్ హౌస్ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గురుకులాల ద్వారా రాష్ట్రంలో మైనారిటీలకు మంచి విద్య అందుతోందన్నారు. విదేశీ విద్యకు కూడా భారీగా నిధులు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ చూపిన దారిలోనే సిద్దిపేట అభివృద్ధి కొనసాగుతోందని తెలిపారు. మైనార్టీలకు ఉన్నత పదవులిచ్చి వారిపై అభిమానాన్ని సీఎం చాటుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 204 ముస్లిం మైనారిటీ పాఠశాలలు ఉన్నాయని హరీశ్ తెలిపారు.

## ఎస్సీ లబ్దిదారుల ఎంపికలో గందరగోళం

ఖమ్మం,జులై25(ఆర్‌ఎన్‌ఎ): ఖమ్మంలో బుధవారం నిర్వహించిన ఎస్సీ లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం నెలకొంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ రుణాల మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. అర్హుల ఎంపిక ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల పరిశీలనకు 12 మండలాల అభ్యర్థులు హాజరయ్యారు. అయితే అధికారులు తమకు సరైన సమాచారాన్ని ఇవ్వడం లేదని, అనర్హులను సైతం ఈ రుణాలకు ఎంపిక చేస్తున్నారని అభ్యర్థులు వేదికపైకి ఎక్కి గందరగోళాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ హనుమంత్ కోడింబా, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జి ఈడీ దరఖాస్తు దారులకు నచ్చజెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో మధ్యాహ్నానికి కూడా ఈ కార్యక్రమం ప్రారంభం కాలేదు.

## ఏపీ వార్తలు

### ఏపీ గవర్నర్‌గా..
# విశ్వభూషణ్ ప్రమాణస్వీకారం

**- ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్**
**- గవర్నర్‌కు ఘనస్వాగతం పలికిన సీఎం జగన్, మంత్రులు**
**- గవర్నర్‌ను కలవకుండానే వెనుదిరిగి వెళ్లిన చంద్రబాబు**
**- నేడు ప్రత్యేకంగా కలుస్తారంటున్న టీడీపీ ఎమ్మెల్యేలు**

అమరావతి, జులై25(ఆంఎన్ఎ) : ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా బిశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ ఆయన చేత రాజ్‌భవన్ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఏపీ మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గవర్నర్‌ను కలవకుండానే వెనుదిరిగిపోయారు. తమ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసొచ్చిన ఆయన వెనుదిరిగి వెళ్లారు. కాగా గురువారం ప్రత్యేకంగా కలిసేందుకు అపాయింట్ మెట్ తీసుకున్నట్లు ఆపార్టీ ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. మరోవైపు మంగళవారం సాయంత్రమే కొత్త గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ విజయవాడకు చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయంలో ఆయనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. సాయుధదళాల గౌరవవందనం అందుకున్న ఆయనకు తర్వాత ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం, గవర్నర్ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా, విజయవాడ నగర పోలీసు కమిషనర్ ద్వారకాతిరుమలరావు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తెలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా నరసింహన్ వ్యవహరించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఒడిశాకు చెందిన బిశ్వభూషణ్ హరిచందన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. బిశ్వభూషణ్ హరిచందన్ 1934 ఆగస్టు 3న రాజకుటుంబంలో జన్మించారు. ఆర్థిక శాస్త్రంలో పీజీ డిగ్రీ పూర్తి చేశారు. 1971లో భారతీయ జనసంఘ్‌లో చేరారు. ఆయనకు భారతీయ జనతాపార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. 1980లో భాజపా ఒడిశా అధ్యక్షుడిగా, భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బిశ్వభూషణ్ సేవలందించారు. ఎమర్జన్సీ వ్యతిరేక పోరాటంలో మీసా చట్టం కింద అరెస్టయ్యారు. ఇందిరాగాంధీ పాలనపై ఒడిశా హైకోర్టు లాయర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 1977లో ఇందిరకు వ్యతిరేకంగా ఒడిశాలో ప్రచారం నిర్వహించారు. 1990లో బిజూ పట్నాయక్ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించారు. 1996లో ఒడిశా బీజేఎల్పీ నేతగా బాధ్యతలు చేపట్టారు. భాజపా,బీజేడీ ఉమ్మడి ప్రభుత్వంలోనూ మంత్రిగా కొనసాగారు

# అబద్ధం వందసార్లు చెబితే నిజమైపోదు

**- ప్రతిఅంశాన్ని టీడీపీ అడ్డుకుంటోంది**
**- సభాసమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**- ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి**

అమరావతి, జులై25(ఆర్ఎన్ఎ) : ప్రతి అంశాన్ని టీడీపీ అడ్డుకుంటోందని, అబద్ధం వందసార్లు చెబితే నిజమైపోదని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ మహిళలకు పెన్షన్లపై అసెంబ్లీలో మంగళవారం జరిగిన రగడ, బుధవారం సైతం కొనసాగింది. టీడీపీ సభ్యులను సభ నుంచి బహిష్కరించడాన్ని ప్రతిపక్షం మండిపడింది. బుధవారం సభ ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మండిపడ్డారు. ప్రతి అంశాన్ని అడ్డుకోవడానికి ప్రతిపక్ష నేత ప్రయత్నిస్తున్నారని సీఎం మండిపడ్డారు. ఒకే అబద్ధాన్ని వందసార్లు చెబితే అదినిజమైపోదని, మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావిస్తున్నామని చెబుతూనే ఉన్న విషయాన్ని మరోసారి సీఎం గుర్తుచేశారు. అయినా ప్రతిపక్ష టీడీపీ తమపై విమర్శలు చేయడం సరికాదని, అనవసర చర్చలతో సభాసమయాన్ని వృథా చేయరాదని జగన్ సూచించారు. సభ ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ ఎమ్మెల్యే సత్యప్రసాద్ లేవనెత్తిన ప్రశ్నకు సంబంధిత మంత్రి సమాధానం ఇచ్చారని, కానీ స్పీకర్ పెద్దమనసుతో మళ్లీ ఆయనకు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. మంత్రి సమాధానం చెప్పిన తర్వాత మళ్లీ అవకాశం అడగడమేంటని సీఎం నిలదీశారు. సభ ప్రారంభమై గంటసేపైనా ఇప్పటి వరకు కేవలం మూడు ప్రశ్నలకే సమాధానం చెప్పగలిగామని, మిగతా వాటికి కూడా బదులిచ్చేందుకు సభ్యులు సహకరించాలని ఆయన కోరారు.

పుష్కరాల్లో 29మంది చావుకు బాబు కారణమయ్యారు- వైసీపీ

అంతకుముందు వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్ మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాల్లో 29మంది చావుకు కారణమెవరని ప్రశ్నించారు. ఈ చావులకు కారణమైన కారణమైన వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాల సమయంలో అక్కడ సినిమా షూటింగ్ జరపడం వల్లే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగిందని, ఈ ఘటనకు కారణమైన వారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు. పుష్కరాల్లో వేలకోట్ల దోపిడీ జరిగిందని, అది కుంభమేళా కాదని.. కుంభకోణమని ఆయన ఆరోపించారు. వేల కోట్ల ప్రజాధనాన్ని మంచినీళ్లలా ఖర్చుపెట్టారని, మరోవైపు కృష్ణ పుష్కరాల్లోనూ అవకతవకలు చోటు చేసుకున్నాయని, వందలాది ఇళ్లను నేలమట్టం చేశారని జోగి రమేశ్ దుయ్యబట్టారు. 29మంది చనిపోవడానికి చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి కారణమని విమర్శించారు. భక్తుల తొక్కిసలాట వల్లే ప్రమాదం జరిగిందని గత ప్రభుత్వం సమర్ధించుకుందని.. ఈ ఘటనకు సోమయాజులు కమిషన్ నివేదికను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధితులకు ఇప్పటికీ పరిహారం అందలేదని.. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. గోదావరి పుష్కరాల ఘటనపై సభాసంఘం వేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. అసలైన దోషులను గుర్తించాలన్నారు. పుష్కరాల వ్యవహారంపై స్పందించిన దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్.. దీనిపై కేబినెట్ సబ్‌కమిటీ ద్వారా ఈ ఘటనపై విచారణ జరిపిస్తామన్నారు. చంద్రబాబు నాయుడు వెళ్లిన పుష్కర ఘాట్ వద్ద కనీస జాగ్రత్తలు తీసుకోలేదని సోమయాజులు కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. ఆ నివేదికను కూడా చంద్రబాబు ప్రభుత్వం బయటకు రాకుండా చేసిందన్నారు. మృతుల కుటుంబసభ్యులు కూడా గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారన్నారు.

# విదేశాంగ విధానంపై అవగాహన లేని ట్రంప్

**ఇరాన్‌తో ఎదురుదెబ్బలు తగిలినా అఫ్గన్‌పై వాచాలత**
**తలలు పట్టుకుంటున్న సొంత దేశనేతలు**
**అవసరం లేకున్న క్షమాపణలు చెబుతున్న పలువురు నేతలు**

న్యూఢిల్లీ,జూలై25 (ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షులు ఎప్పుడూ ఇతర దేశాల ద్వైపాక్షిక వ్యవహారాల్లో తలదూర్చిన దాఖలాలు లేవు. ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తరవాతనే అంతర్జాతీయంగా అనేక సమస్యలు సృష్టిస్తున్నారు. ఇతర దేశాల అంతరంగిక వ్యవహారాల్లో ఎలాగో వేలు పెట్టాలని చూస్తున్నారు. ప్రధానంగా ఇరాన్ విషయంలో ఆయన వ్యవహరిస్తున్న తీరు గల్ఫ్ తీరంలో పెత్తనానికి పరాకాష్టగా చూడాలి. ఇరాన్‌ను బెదరింపులతో దారికి తెచ్చుకోవాలని తెగయత్నిస్తున్నారు. దాడులతో బెరింపులకు పాల్పడుతున్నారు. అయితే అంతే ధీటుగా ఇరాన్ స్పందించడంతో తోకముడుస్తున్నాడు. నిజానికి వేరే ఏ చిన్న దేశమైనా ఇప్పటికి భయపడి పాదాక్రాంతం అయ్యేది. కానీ ఇరానీయుల సాహసాన్ని అభినందించాల్సిందే. అలాగే కాశ్మీర్ విషయం ఆసరాగా చేసుకుని మన దేశంపై పెత్తనం చెలాయించాలన్న భావన ట్రంప్‌లో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే పాక్ ప్రధానితో చర్చల సందర్భంగా కావాలనే ఇలాంటి వ్యాఖ్యలు చేసివుంటారు. కశ్మీర్‌పై వ్యాఖ్యలతో కలకలం సృష్టించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అఫ్గానిస్థాన్ విషయంలోనూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను తల్చుకుంటే అఫ్గాన్ యుద్ధంలో సులభంగా గెలవగలనని.. అయితే, కోటిమందిని చంపాలని తాను కోరుకోవడం లేదని పేర్కొన్నారు. పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో సోమవారం భేటీ అయిన ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్గాన్ సంక్షోభానికి త్వరగా తెరదించగల ప్రణాళికలు తన వద్ద ఉన్నాయని ట్రంప్ అన్నారు. కానీ అవి కేవలం 10 రోజుల్లో భూమిపై నుంచి ఆ దేశాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తాయని వ్యాఖ్యానించారు. అందుకే ఆ మార్గాన్ని ఎంచుకోవడం లేదని తెలిపారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి తెరతీయడంతో ఆయన ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టింది. కశ్మీర్ సమస్య భారత్, పాక్ మధ్య ద్వైపాక్షిక అంశమని మంగళవారం యూఎస్ ప్రకటించింది. వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ఇరుదేశాలు కూర్చొని మాట్లాడుకోవడాన్ని తాము స్వాగతిస్తామని తెలిపింది. ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఒకరు ఈ మేరకు స్పందించారు. పాక్ తమ భూభాగంలోని ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపితే.. భారత్‌తో ద్వైపాక్షిక చర్చలకు బీజం పడుతుంది. ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు ఆ దిశగా పని ప్రారంభించారని కూడా ఆయన పేర్కొన్నారు. భారత్, పాక్ కోరితే కశ్మీర్ వివాద పరిష్కార ప్రక్రియలో సహాయం చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని శ్వేతసౌధం సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ట్రంప్ వ్యాఖ్యలను అమెరికాలో పలువురు చట్టసభ సభ్యులు కూడా తీవ్రంగా ఖండించారు. భారత్‌కు తమ మద్దతు ప్రకటించారు. డెమొక్రటిక్ పార్టీ కీలక నేత బ్రాడ్ షెర్మాన్ ఏకంగా ట్రంప్ వ్యాఖ్యలపై భారత రాయబారికి క్షమాపణలు తెలిపారు. కశ్మీర్ వివాదంలో తృతీయ పక్షం జోక్యానికి భారత్ వ్యతిరేకమని దక్షిణాసియాలో విదేశాంగ విధానం గురించి అవగాహన ఉన్నవారందరికీ తెలుసు. మోదీ మధ్యవర్తిత్వాన్ని కోరరని కూడా తెలుసు. ట్రంప్ వ్యాఖ్యలు అపరిపక్వంగా, ఆందోళనకంగా ఉన్నాయి. ఆయన వ్యాఖ్యలపై భారత రాయబారి హర్ష్ శృంగ్లాకు క్షమాపణలు చెప్పా అని షెర్మాన్ తెలిపారు. విదేశీ వ్యవహారాలపై హౌస్ కమిటీకి ఛైర్మన్‌గా ఉన్న ఎలియట్ ఎంజెల్ కూడా భారత్‌కు మద్దతు ప్రకటించారు. కశ్మీర్ వివాదాన్ని భారత్, పాక్ ద్వైపాక్షిక చర్చలతో పరిష్కరించుకోవాలని అభిప్రాయ పడ్డారు. ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలతో భారత్- అమెరికా సంబంధాలు దెబ్బతినే ముప్పుందని పలువురు మాజీ దౌత్యవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీర్ విషయంలో ట్రంప్ సరైన అవగాహన లేకుండా మాట్లాడారని అమెరికా విదేశాంగ శాఖ మాజీ దౌత్యవేత్త అలైసా ఏరెస్ పేర్కొన్నారు. ట్రంప్ సరైన సన్నద్ధత లేకుండా సమావేశాలకు హాజరవుతున్నారు. ఏది తోస్తే అది మాట్లాడుతున్నారు. దౌత్యపరమైన వ్యవహారాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. సరైన భాష వాడాలి. వాస్తవాలను వక్రీకరించకూడదు. కానీ అవేమీ ట్రంప్ పాటించలేదని ఆమె వ్యాఖ్యానించారు. భారత్‌తో సంబంధాలకు ట్రంప్ చాలా నష్టం చేశారు. కశ్మీర్, అఫ్గానిస్థాన్ విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదని భారత్‌లో అమెరికా మాజీ రాయబారి రిచర్డ్ వర్మ అన్నారు. మొత్తంగా ఇప్పుడు ట్రంప్ దేశంలోనూ తన వ్యాఖ్యల కారణంగా పలుచన అయ్యారు.

## పిచ్చోడి చేతిలో రాయిలా..

**జగన్ చేతిలో అధికారం**
**- ట్విటర్‌లో టీడీపీ ఎంపీ కేశినేని నాని**

అమరావతి, జులై25 (ఆంఎన్ఎ) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడ ఎంపీ కేశినేని నాని విరుచుకుపడ్డారు. ఘాటు వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో టార్గెట్ చేశారు. జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో నిరుద్యోగులకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో యువతకు కష్టాలు ఎదరవుతాయంటూ ఆయన అన్నారు. కేశినేని తన ట్వీట్‌లో 'జగన్ రెడ్డి గారూ.. పిచ్చి వాడి చేతిలో రాయిలాగా ఉంది మీ చేతిలో అధికారం.. మీరు చేసిన చట్టమే రేపు ఇతర రాష్ట్రాలు చేస్తే హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, ముంబై, పూణె ఢిల్లీ లాంటి చోట్లలో మన వారికి ఉద్యోగాలు వస్తాయా? అని ప్రశ్నించారు. అమ్మ పెట్టలేదు అడుక్కు తిననివ్వదు అన్నట్లుంది పరిస్థితి ఉదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏపీలో ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఈ నిర్ణయం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే సంస్థలు, పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని విజయవాడ ఎంపీ తప్పుబట్టారు.. ఈ చట్టం వల్ల నిరుద్యోగులకు కష్టాలు పెరుగుతాయంటున్నారు.

## జమ్మలమడుగులో నాటుబాంబుల స్వాధీనం

కడప,జులై25(ఆర్ఎన్ఎ): రాయలసీమలో నాటు బాంబులు బయటపడ్డాయి. కడప జిల్లాలోని జమ్మలమడుగు పట్టణానికి సమీపంలో 54 నాటు బాంబులు లభ్యమయ్యాయి. ముద్దనూరు రోడ్డులో రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం భూమిని చదును చేస్తుండగా ఓ బకెట్ బయటపడింది. దీంట్లో నాటు బాంబులు ఉండడాన్ని గమనించిన జేసీబీ, ట్రాక్టర్ డ్రైవర్లు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపించారు. మొత్తంగా నాలుగు బకెట్లలో 54 నాటు బాంబులు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అయితే ఈ నాటు బాంబులు 20 ఏళ్ల క్రితం పాతిపెట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తున్న యజమానిని ప్రశ్నించే అవకాశం ఉంది.

## కిడ్నాపైన బాలుడు జషిత్ కోసం ముమ్మర గాలింపు

**బృందాలుగా రంగంలోకి దిగిన పోలీసులు**

కాకినాడ,జులై25(ఆర్ఎన్ఎ): కిడ్నాపైన బాలుడి ఇంకా లభించలేదు. బాలుడుని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందదాలు గాలిస్తున్నాయి. కిడ్నావర్లు ఎవరన్నది కూడా అంతుచిక్కడం లేదు. తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలంలోని విజయలక్ష్మీనగర్‌లో సోమవారం రాత్రి అపహరణకు గురైన చిన్నారి జషిత్(4) ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తు న్నారు. కిడ్నాపర్లకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధాంాలు దొరకలేదు. తమ చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమ బిడ్డ వీలైనంత త్వరగా తమ చెంతకు చేరాలని దేవుడిని వేడుకుంటున్నారు. మరోవైపు ఆచూకీ కోసం ఇప్పటికే పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రతిరోజూ సాయంత్రం జషిత్ తమ ఇంటి వద్ద ఆడుకుంటాడని స్థానిక ఇంటి యజమాని తెలిపారు. అయితే ఈ నెల 3వ తేదిన జషిత్ ఆడుకుంటున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముఖానికి ముసుగులు వేసుకుని తమ ఇంటికి వచ్చారని, ఇల్లు ఏమైనా ఖాళీ ఉందా అని అడిగి ఫోన్ నంబర్ తీసుకువెళ్లారని పోలీసులకు తెలిపారు. దీంతో 3వ తేది నాటి సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి, ఆ వ్యక్తులే చిన్నారిని కిడ్నాప్ చేసి ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు. అయితే జషిత్ కిడ్నాప్ పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిందని పోలీసులు అభిప్రాయ పడుతున్నారు. కిడ్నాప్ వెనక ఎలాంటి ప్రణాళిక ఉందో ఆధారాలు సేకరిస్తున్నారు. అలాగే కిడ్నాప్ చేసిన వారు ఇంతవరకు ఎలాంటి డిమాండ్ ముందుకు తీసుకుని రాలేదు.

# చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం

## నలుగురు తిరుమల భక్తుల దుర్మరణం

చిత్తూరు,జులై25(ఆర్ఎన్ఎ): చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. జిల్లాలోని నగరి సమీపంలోని కన్నమెట్ట వద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తిరుమల నుంచి తిరిగివస్తున్న కారు, ఓ ప్రయివేటు బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు.. గాయపడ్డ ఇద్దరు మహిళలను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులంతా తమిళనాడులోని అయ్యప్పతంగల్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న సందర్భంలో రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి తిరుపతి–చెనై జాతీయ రహదారి నగరి పట్టణం సమీపంలోని కన్నామిట్ట ప్రాంతంలో చోటు చేసుకుంది. తమిళనాడులోని నంగనెల్లూరుకు చెందిన అనంతకుమార్(45), బాలాజీ(40), ముత్తుకుమార్(50), మూర్తి(55), హేమలత, జనరంజని తిరుమల దైవదర్శనానికి వ్యానులో వెళ్లారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో మంగళవారం రాత్రి 9.15 నిమిషాలకు చెనై నుంచి తిరుపతికి వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సును వ్యాను ఢీకొంది. జాతీయ రహదారిలో ఏర్పడిన గొయ్యిని వ్యాను తప్పించ బోయి బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో అనంతకుమార్, బాలాజీ, ముత్తుకుమార్, మూర్తి అక్కడికక్కడే మృతి చెందారు. వ్యానులో ఉన్న హేమలత, జనరంజని తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నగరి ప్రభుత్వ

ఆసుపత్రికి తరలించారు. అనంతరం జేసీబీ వాహనంతో వ్యానులో ఇరుక్కు పోయిన మృతదేహాలను బయటకు తీశారు. మృత దేహాలను పోస్టుమార్టర నిమిత్తం నగరి ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పుత్తూరు సీఐ వెంకటరామిరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగివున్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

విశాఖపట్నం జిల్లా కశింకోట మండలం ఎన్.జి.పాలెం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని పలాస నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో 12 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు తమ వాహనాల్లో క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సును పలాస డిపోకు చెందినదిగా గుర్తించారు. ఘటనా సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం

# పర్యాటక వసతి గృహం నిర్మాణం

విశాఖపట్నం,జులై25(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా బౌద్ధారామాల అభివృద్ధిలో భాగంగా భీమిలి వద్ద పర్యాటక వసతి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. భీమిలి బీచ్‌రోడ్డు–వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ రోడ్డులో గొల్లల తిమ్మాపురం బావికొండ ప్రవేశ మార్గం వద్ద ఈ పర్యాటక వసతి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా బౌద్ధారామాల అభివృద్ధిలో భాగంగా కేంద్రం మంజూరు చేసిన రూ. 2 కోట్ల స్వదేశీ దర్శన్ కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. సందర్శకులు సేద తీరేందుకు అవసరమైన వసతి, సదుపాయాలు కల్పించనున్నారు. ధ్యానం, యోగా,పుస్తకశాల వంటివి ఏర్పాటు చేయనున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచుతారు. సందర్శకుల సంఖ్యను గణనీయంగా పెంచి ఈ బౌద్ధారామానికి వన్నె తెచ్చేలా దీనిని నిర్మిస్తున్నట్లు పర్యాటకశాఖ డీఈ సత్యనారాయణ తెలిపారు.

### వైసీపీ పాలనలో..
# ప్రజలకు మేలుకంటే కీడే జరుగుతుంది

**- పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లుంది**
**- మరో 25ఏళ్లు కేంద్రంలో బీజేపీదే అధికారం**
**- రాష్ట్రంలో బీజేపీతో ప్రజలకు మేలు జరుగుతుంది**
**- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్**

కాకినాడ, జులై25(ఆర్ఎన్ఎ) : వైసీపీ పాలనలో ప్రజలకు మేలుకంటే కీడే జరుగుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేటలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాంమాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలకు సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాంమాధవ్ మాట్లాడుతూ.. ఆదిలోనే వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రాష్ట్రంలో రెండో ప్రాంతీయ పార్టీ అయిన వైసీపీ మేలు చేస్తుందని ప్రజలు అధికారం ఇచ్చారని, కానీ అధికార పార్టీ తప్పటడుగుల వల్ల మేలు కంటే.. కీడే ఎక్కువ జరుగుతుందన్న భయం ప్రజల్లో కనపడుతోందని రాంమాధవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా రాష్ట్ర ప్రజల పరిస్థితి ఉందని తెలిపారు. ఏపీ ప్రజలకు మేలు జరగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. మరో 25 ఏళ్ల పాటు కేంద్రంలో బీజేపీదే అధికారమని రాంమాధవ్ పేర్కొన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలోనూ, తెలంగాణలోనూ పలు పార్టీల నుంచి బీజేపీలో చేరేందుకు నేతలు ఆసక్తిచూపుతున్నారని అన్నారు. ఏపీలో ఇప్పటికే పలువురు టచ్‌లో ఉన్నారని, ఆషాడం పూర్తవ్వగానే వారు పార్టీలో చేరే అవకాశం ఉందని అన్నారు. ఏపీలో వైసీపీకి ప్రత్యామ్నాయం బీజేపీనే అని, కాంగ్రెస్ పనైపోయిందని, ఇక టీడీపీ సతికలపడ్డ పార్టీ అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పాలనతో ప్రజలంతా బీజేపీవైపు మొగ్గుచూపుతున్నారని రాంమాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# బంగాళాదుంపల మధ్య గంజాయి తరలింపు

**50 లక్షల విలువైన గంజాయి స్వాధీనం**

విశాఖపట్టణం,జులై25(ఆర్ఎన్ఎ): విశాఖపట్టణంలో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని గంగరాజు మాడ్గుల ప్రాంతంలో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఓ జీపులో తరలిస్తున్న 500 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీలేరు నుంచి బంగాళాదుంపల మధ్యలో గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. గంజాయిని తరలిస్తున్న 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఈ గంజాయి విలువ రూ. 50 లక్షల విలువ చేస్తుందని అధికారులు తెలిపారు. అనకాపల్లి రేంజ్ పరిధిలో గడిచిన 10 నుంచి 12 రోజుల్లో గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్న 12 వాహనాలను సీజ్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ప్రధాన స్మగ్లరైన ముగ్గురి కోసం గాలిస్తున్నామని ఎక్సైజ్ పోలీసులు చెప్పారు. జులై 21వ తేదీన ఓ వ్యక్తి నుంచి రూ. 25 లక్షల విలువ చేసే 195 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. జులై 12వ తేదీన విశాఖపట్టణం రూరల్‌లోని నీలంపేట జంక్షన్ వద్ద రెండు వాహనాల్లో తరలిస్తున్న 1400 కిలోల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు.

# ఎస్ఐ పోస్ట్ అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లు

హైదరాబాద్,జులై25(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఎస్ఐ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లు నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి ఏర్పాట్లు చేపట్టింది.

ఈ నెల 25, 26 తేదీల్లో ఎస్సై పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పోస్టులకు ఎంపికైనవారి ఫొటోలు, సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. తర్వాత మెడికల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్‌తో పాటు పాత పది

జిల్లాకేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. తుది రాతపరీక్షకు హాజరైన సమయంలో అభ్యర్థుల నుంచి సేకరించిన వేలిముద్రలను.. మెడికల్ టెస్ట్‌లకు వెళ్లేముందు సరిపోల్చనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు.



# క్షేమంగా అమ్మ ఒడికి

**- కిడ్నాపర్ల చెరనుంచి ఇంటికి చేరిన జసిత్**
**- అర్ధరాత్రి ఇటుకబట్టీ వద్ద వదిలివెళ్లిన కిడ్నాపర్లు**
**- పోలీసులకు సమాచారమిచ్చిన ఇటుక బట్టీ కార్మికులు**
**- బాలున్ని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్పీ నయీం**
**- ఆనంద భాష్పాలతో జసిత్‌ను హత్తుకున్న తల్లిదండ్రులు**
**- పోలీసులకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపిన బాలుడి తల్లిదండ్రులు**
**- బాలుడు తల్లిఒడికి చేరడంతో ఊపిరిపీల్చుకున్న పోలీసులు**

కాకినాడ, జులై25(ఆర్ఎన్ఎ) : తూర్పుగోదావరి జిల్లా మండపేటలో నాలుగేళ్ల బాలుడు జసిత్ కిడ్నాప్ కథ సుఖాంతమైంది. జసిత్ క్షేమంగా కిడ్నాపర్ల చెర నుంచి బయటపడ్డాడు. దుండగులు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రాయవరం మండలం కుతుకులూరి శివారులోని ఇటుకబట్టి వద్ద వదిలి వెళ్లారు. చిన్నారి ఏడుపు విని అక్కడి కూలీలు జషిత్‌ను చేరదీశారు. రాత్రంతా తమ వద్దే ఉంచుకున్నారు. ఆకలితో ఉన్న చిన్నారికి ఫలహారం పెట్టి చిన్నారి తండ్రికి సమాచారం అందించారు. వీడియో కాల్ ద్వారా జషిత్‌ను నిర్ధారించుకున్న ఆయన తండ్రి పోలీసుల సాయంతో చిన్నారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ నయీం అస్మి బాలుడిని తల్లికి అప్పగించారు.

**ఊపిరిపీల్చుకున్న తల్లిదండ్రులు..**

జసిత్‌ను చూడగానే అతడి తల్లి ఆనంద భాష్పాలతో హత్తుకుంది. జసిత్ కిడ్నాప్ అయినప్పటి నుంచి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఆమెని ఓదార్చడం ఎవరితరం కాలేదు. కుమారుడు క్షేమంగా రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి హద్దులు లేవు. బాలుడు దొరికాడన్న సమాచారం తెలియడంతో బంధువులు, స్థానికులు జసిత్ ఇంటికి భారీగా చేరుకున్నారు. బాలుడు క్షేమంగా తిరిగి రావడంతో మండపేట వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డ కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికి జసిత్ తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. జసిత్ కోసం తీవ్రంగా శ్రమించిన పోలీసులను తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు. మండపేటలో జూలై 22న కిడ్నాప్ అయిన జసిత్ ఆచూకీ కోసం 500 మంది పోలీసులు 17 ప్రత్యేక బృందాలుగా మూడు రోజులు జల్లెడ పట్టారు. ఓవైపు పోలీసుల ముమ్మర గాలింపు చర్యలు.. మరోవైపు మీడియాలో వరుస కథనాలు.. దీంతో బెదిరిపోయిన కిడ్నాపర్లు మరో దారి లేక జసిత్‌ను విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్పీ నయీం అస్మీ చొరవ వల్లే తమ పిల్లాడు క్షేమంగా ఇల్లు చేరాడని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల పనితీరుపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. జసిత్ రాకతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. జసిత్ ఒంటి మీద ఎలాంటి గాయాలు లేవని, ఆరోగ్యంగా, యాక్టివ్ గానే ఉన్నాడని పోలీసులు తెలిపారు.

**నవ్వులు పూయించిన జసిత్..**

చిన్న పిల్లలు విషయ తీవ్రత తెలియకుండా చేసే పనులు కొన్నిసార్లు నవ్వుతెప్పిస్తాయి. ఇటీవల కిడ్నాప్‌కు గురై క్షేమంగా ఇంటికి చేరిన జషిత్ కూడా ఇటువంటి పనే చేశాడు. ఆ బుడతడు ఇంటికి చేరుకోగానే మీడియా అతన్ని చుట్టుముట్టింది. మీడియా వారు ఏవేవో ప్రశ్నలు అడిగారు.. జషిత్ కూడా ఉత్సాహంగా సమాధానం చెప్పాడు. ఇంతలో ఒక విలేకరి అత్యుత్సాహంగా కిడ్నాపర్లు నీకు తెలుసా అని ప్రశ్నించాడు. దీనికి జషిత్ కొన్ని క్షణాలు ఆలోచించి.. మాటల మధ్యలో 'ఇద్దరిలో ఒకరిపేరు తెలీదు.. ఒకరి పేరు తెలుసు' అన్నాడు. వెంటనే అలర్ట్ అయిన మీడియా ప్రతినిధులు ఆ కిడ్నాపర్ పేరు చెప్పమని అడిగారు. దీనికి స్పందించిన జషిత్ 'మీకు చెప్పను .. మా ఫ్రెండ్స్‌తో మాత్రమే షేర్ చేసుకుంటా' అని ముద్దుముద్దుగా సమాధానమివ్వడంతో అక్కడ నవ్వులు వెల్లివిరిశాయి. అనంతరం చిన్నారి జషిత్‌పై మీడియా ప్రతినిధులు పలు ప్రశ్నలు సంధించారు. వీటిల్లో కొన్నిటికి ఉత్సాహంగా సమాధానం చెప్పాడు. తనను కిడ్నాప్ చేసిన వ్యక్తుల్లో ఒకరిపేరు రాజు అని, అక్కడ ఓ తాతయ్య కూడా ఉన్నాడని అన్నారు. తనకు రోజు ఇడ్లీనే పెట్టారంటూ జషిత్ అందరినీ నవ్వించారు. తనను రాత్రి సమయంలో మీ అత్తవారింటికి తీసుకెళ్లానంటూ తీసుకొచ్చి వదిలేశారని, ఏడుస్తున్న తనను అక్కడివారు గుర్తించారని అన్నారు. తనను కిడ్నాప్ చేసే విధానాన్ని కూడా చకచకా చెప్పేశాడు.

**ఎస్పీపై ప్రశంసల జల్లు..**

బాలుడి కిడ్నాప్ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఛేదించిన జిల్లా ఎస్పీ నయీంపై మండపేట వాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. బాలుడిని తీసుకొచ్చి స్వయంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఆయన్ని స్థానికులు పైకెత్తి ఊరేగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. బాలుడిని క్షేమంగా వదిలేసినంత మాత్రాన కిడ్నాపర్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాలుడు చెప్పిన వివరాల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

**కిడ్నాపర్ల లక్ష్యమేంటో?**

సోమవారం రాత్రి 7 గంటల సమయంలో జషిత్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు గురువారం తెల్లవారుజామున బాలుడిని అనపర్తి మండలంలోని కుతుకులూరు వద్ద వదిలివెళ్లారు. బాలుడు ఎలాంటి అనారోగ్యానికి గురికాకపోవడం, ఉత్సాహంగా ఉండటంతో కిడ్నాపర్లు జషిత్‌ను బాగానే చూసుకున్నట్లు తెలుస్తోంది. తనను ఎత్తుకెళ్లి ఓ ఇంట్లో ఉంచారని, ఇడ్లీలు, పెరుగన్నం పెట్టారని జషిత్ చెబుతున్నాడు. అతడి ఒంటిపై కూడా ఎలాంటి గాయాలు లేవు. సాధారణంగా డబ్బుల కోసమో, వ్యక్తిగత కక్షతోనో పిల్లల కిడ్నాప్ లు జరుగుతుంటాయని, అయితే జషిత్ వ్యవహారంలో ఏ కోణమూ తమకు ఇంకా దొరకలేదని పోలీసులు చెబుతున్నారు. డబ్బుల కోసమే అయితే కిడ్నాప్ చేసిన వెంటనే తల్లిదండ్రులకో, బంధువులకో ఫోన్ చేసేవారని.. కానీ జషిత్ కిడ్నాప్ చేసినవారు ఎవరికీ కూడా ఒక్క కాల్ చేయలేదు. అంటే ఇది డబ్బులు కోసం చేసింది కాదని స్పష్టమవుతోంది. ఒకవేళ్ల వ్యక్తిగత కక్షతో కిడ్నాప్ చేసినట్లయితే బాలుడికి హాని తలపెట్టేవారు. కానీ కిడ్నాపర్లు తనను బాగా చూసుకున్నారని, వేళకు ఆహారం కూడా పెట్టారని బాలుడు చెబుతున్నారు. దీంతో ఈ కేసును ఏ కోణంలో దర్యాప్తు చేయాలో పోలీసులకు అర్థం కావడం లేదు. బాలుడి తల్లిదండ్రులను బెదిరించడానికి ఎవరైనా ఈ పని చేశారా అంటే.. తమకెవరితోనూ గొడవలు, శత్రుత్వం లేదని వారు చెబుతున్నారు. తనను కిడ్నాప్ చేసిన వారిలో రాజు అనే వ్యక్తి ఉన్నాడని, అతడు తనకె తెలుసని జషిత్ చెప్పగా పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. బాలుడిని కిడ్నాప్ చేసేందుకు ముందుగానే అతడితో ఎవరైనా పరిచయం పెంచుకున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి జషిత్ కిడ్నాపర్ల చెర నుంచి క్షేమంగా బయటపడినా.. ఈ కేసు పోలీసులకు సవాలుగా మారింది. నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, త్వరలోనే పట్టుకుంటామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నయీం స్పష్టం చేస్తున్నారు.

## శరవేగంగా దుర్గమ్మ వారధి పనులు

**సకాలంలో పూర్తి చేసేలా చర్యలు**

విజయవాడ,జూలై25 (ఆంఎన్ఎ): విజయవాడ కనకదుర్గ గుడి వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు చకచకా సాగుతున్నాయి. కొంత ఆలస్యం అయినా పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి కనకదుర్గ వారధి వరకు కృష్ణానది వెంట రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పనుల్లో భాగంగా ముందుగా ఘాట్ల నిర్మించారు. మిగిలిన దశల్లో అనేక పనులు నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రాంతంలో యూటీ పరిధిలోకి వచ్చే ప్రాంతం అనేక అవసరాలకు ఉపయోగపడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అందరూ ఈ ప్రాంతాన్ని ఉపయోగించుకోవటానికి వీలుగా, ఘాట్లకు వెళ్ళేవారికి ఇబ్బంది కలగకుండా ఉండటానికి అప్రోచలను శ్లాబ్ విధానంలో వేయాలని సీఎం సూచించారు. దీంతో ప్రతిపాదనను కేంద్రానికి కూడా పంపించారు. డిజైన్లను మార్చటం వల్ల కొంత అంచనా వ్యయం పెరిగే అవకాశం ఉంది. దుర్గా ఫ్లై ఓవర్ అనుసంధాన యూటీ పనుల డిజైన్ల మార్పునకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రానికి నివేదించింది. యూటీకి రెండు వైపులా అప్రోచ పనులను గోడకట్టి మట్టితో నింపే బదులు స్లాబ్ విధానం విషయమై డిజైన్ల మారునకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవలి కాలంలో దుర్గా ఫ్లై ఓవర్, నాలుగు లేన్ల రోడ్ల విస్తరణకు సంబంధించి అధికారులు సమీక్షించారు. యూటీ పనులు పూర్తయిన నేపథ్యంలో అప్రోచ్ పనులకు స్టేట్ హైవేస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. యూటీకి రెండువైపులా అప్రోచ్ పనులు చేపట్టాల్సి ఉంది. అప్రోచలకు ముందుగా వాల్స్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. త్వరలో పనులు పూర్తి చేసి రాకపోకలకు అనుమతించనున్నారు.

## అక్రమ లేఔట్లపై విచారణ: డిపివో

చిత్తూరు,జూలై25 (ఆర్ఎన్ఎ):జిల్లాలో అక్రమంగా ఎన్వోసీ ప్రతాలు లేకుండా వేసిన లేఅవుట్లపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని జిల్లా పంచాయతీ అధికారి అన్నారు. పంచాయితీ నిధులను దుర్వినియోగం చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. పంచాయతీల నిధుల దుర్వినియోగం విషయంలో గతంలో కొందరు సర్పంచుల చెక్‌పవర్ రద్దు చేశారు. అక్రమ లేవుట్లు తిరుపతి తుడా పరిధిలోని పంచాయతీల్లో ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అక్రమ లేవుట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకునేందుకు పంచాయతీల నుంచి అనుమతి కోరినప్పుడు స్థలం విలువలో పదిశాతం పంచాయతీ రుసుముగా వసూలు చేసి అనుమతులు ఇస్తున్నామని తెలిపారు.

## అసెంబ్లీలో వ్యక్తిగత దాడికే ప్రాధాన్యం

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బాబు**

అమరావతి,జూలై25 (ఆంఎన్ఎ): అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు నొక్కేస్తున్నారని ప్రతిపక్ష నేత, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. తనపై వ్యక్తిగత దాడి చేసేందుకే ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపించారు. తమ నిరసనలను ఎక్కడా చూపకుండా చేశారన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పుడో జరిగిన పుష్కరాలపై చర్చ చేపట్టారని చెప్పారు. 45 ఏళ్ల వారికి పింఛను ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలన్నందుకు ముగ్గురు తెదేపా నేతలను సస్పెండ్ చేశారని, సస్పెన్షన్‌పై మాట్లాడే అవకాశం ఇవ్వకుండా చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతి ప్రాజెక్టును నాశనం చేశారని, రాష్ట్రాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా ఇసుక దొరకడం లేదని, దీంతో భవన నిర్మాణ కార్మికులు రో÷-డడెక్కే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు.

# బాలుడు జషిత్ ఆచూకీ కోసం 17 బృందాలు

## ఆధారాలు సేకరిస్తున్నామన్న ఎస్పీ

కాకినాడ,జులై25(ఆర్ఎన్ఎ): తూర్పుగోదావరి జిల్లా మండపేటలోని విజయలక్ష్మీ నగర్‌లో జషిత్ అనే బాలుడి అపహరణ కేసులో కొన్ని ఆధారాలు లభ్యమైనట్లు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నయీమ్ హస్మి చెప్పారు. అతడి ఆచూకీ కనిపెట్టేందుకు తీవ్రంగా గాలిస్తున్నామని అన్నారు. ఈ నెల 22న బాలుడి ఇంటి సమీపంలోని సత్యదేవ అపార్ట్‌మెంట్‌కు అ÷-దదెకోసం వచ్చిన ఇద్దరు యువకులను అనుమానితులుగా భావించి విచారణ చేస్తున్నా మన్నారు. మండపేట పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ బాలుడి ఆచూకీ కోసం 17 బృందాలు గాలిస్తున్నాయని అన్నారు. అనుమానిత యువకులు వచ్చినప్పటి సీసీ టీవీ దృశ్యాలను ల్యాబ్‌కు పంపించామన్నారు. గతంలో బాలుడి తండ్రి బైక్ చోరీ కేసును పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆర్థిక లావాదేవీలు, మానవ అక్రమ రవాణా, వ్యక్తిగత కక్షలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ వివరించారు. ఈ కేసులో 10 మంది అనుమానితులను విచారించామని, మొత్తం 17 పోలీసు బృందాలు గాలిస్తున్నాయని ఆయన చెప్పారు. కిడ్నాపర్ల నుంచి ఎలాంటి డిమాండ్ రాలేదన్నారు. బాలుడ్ని సురక్షితంగా పట్టుకుంటామని ఎస్పీ నయీమ్ ధీమా వ్యక్తం చేశారు.

# టీడీపీ సభ్యుల నిరసన

## ప్రభుత్వ తీరుకు నిరసనగా సమావేశాల బహిష్కరణ

అమరావతి,జులై25(ఆర్ఎన్ఎ): శాసనసభ సమావేశాలను మొత్తం బహిష్కరించాలని తెదేపా నిర్ణయించింది. ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడటానికి అవకాశమివ్వనందుకు నిరసనగానే నేటి సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు తెలిపింది. అంతకుముందు ప్రతిపక్ష నేత చంద్రబాబుకు సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని తెదేపా సభ్యులు వాకౌట్ చేశారు. రైతు సమస్యలు, పెట్టుబడి సాయంపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు మైక్ ఇవ్వాలంటూ సభలో నినాదాలు చేసిన సభ్యులు అనంతరం సభ నుంచి బయటకు వెళ్లారు. అంతకు ముందు ఇవాళ అసెంబ్లీ ప్రారంభానికి ముందే సభాహక్కులు కాపాడాలంటూ శాసనసభ ప్రధాన ద్వారం వద్ద తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. తెదేపా అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సహా పార్టీ శాసనసభ్యులందరూ ఆందోళనలో పాల్గొన్నారు. తెదేపా శాసనసభ ఉపనేతలపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

# ఆక్వాతో కాలుష్యం అవుతున్న పొలాలు

## నాయకుల ఆక్రమార్జనపై సిపిఎం మండిపాటు

ఏలూరు,జూలై25(ఆర్ఎన్ఎ): ప్రజలందరికీ అన్నం పెట్టే పచ్చనిపొలాలను నాశనం చేసి చేపల చెరువులు తవ్వితే సహించేది లేదని సిపిఎం జిల్లాకార్యదర్శి బలరామ్ హెచ్చరించారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధి లేదని సర్వే గణాంకాలు తెలుపుతున్నాయి. అందుకు భిన్నంగా గతంలో అధికార పార్టీ నాయకులే లంచాలు తీసుకుని పొలాలను నాశనం చేసి చెరువులను అధికారుల చేత అనుమతులు ఇప్పించేస్తూ ఆక్రమార్జనకు పాల్పడ్డారని మండిపడ్డారు. దీంతో పచ్చటి పశ్చిమ కాలుష్యకారకంగా మారుతుందని విమర్శించారు. పచ్చటి వరి పొలాలను చేపలు, రొయ్యల సాగు కోసం చెరువు తవ్వకాలకు అధికారులు అనుమతులిచ్చారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు కూడా హెచ్చరించారు. డెల్టా ప్రాంతంలో అక్రమంగా తవ్వతున్న చేపలు, రొయ్యల చెరువులను అరికట్టాలని, వరి సాగయ్యే భూములను కాపాడాలని కోరారు. ఆక్వా కాలుష్యంతో తాగునీరు దొరకని పరిస్థితులు దాపురించాయని, భవిష్యత్తు తరాలకు కాలుష్యరహిత జలాలను ఇవ్వాలంటే చెరువులు తవ్వకుండా కఠిన నిబంధనలను విధించాలని కోరారు. పొలాలను చెరువులుగా తవ్వితే ప్రాణత్యాగం చేసైనా అడ్డుకుంటామని వారు అన్నారు. వ్యవసాయానికి అప్పులు దొరక్క కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో కౌలుసాగు సంక్షోభంలో పడిందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. కౌలురైతులకు వడ్డీలేని పంట రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. భూఅధీకృత సాగుదారు చట్టం ప్రకారం ఇచ్చిన రుణార్హత కార్డులకు పంట రుణాలివ్వకుండా బ్యాంకర్లు వాటిని రుణ అనర్హత కార్డులుగా మార్చివేస్తున్నారని విమర్శించారు. కౌలురైతులకు అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

# డంపింగ్ యార్డుగా రైతుల భూములు

## ఫిర్యాదుతో పరిశీలించిన గ్రీన్ ట్రిబ్యునల్ బృందం

ఏలూరు,జులై25(ఆర్ఎన్ఎ): పోలవరం గ్రామ సమీపంలో డంపింగ్‌యార్డు నిమిత్తం రైతుల భూముల్లో మట్టి వేసి పర్యావరణానికి విఘాతం కలిగించారంటూ పి.పుల్లారావు వేసిన పిటిషన్‌పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సభ్యులు సందర్శనకు వచ్చారు. కలెక్టర్ ముత్యాలరాజుతో కలిసి కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి అడిషనల్ డైరెక్టర్ ఎం.మధుసూదన్‌రావు, శాస్త్రవేత్త పాల్‌పండి, రవీంద్రనాథ్ తదితరులు బుధవారం పోలవరంలో పర్యటించారు. గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో పర్యావరణానికి విఘాతం కలగకుండా ఇంజినీర్లు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం పోలవరంలోని బీసీ కాలనీని సందర్శించారు. దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని, బావుల్లో నీరు కలుషితమవుతోందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. వారి వెంట ప్రాజెక్టు ఎస్ఈ కెఎన్.శంకర్‌రావు, ఐటీడీఏ పీవో హరేంద్రియప్రసాద్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.మోహన్‌కుమార్, సీఈలు బాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

# సజావుగా ఉపాధ్యాయ బదిలీలు

అనంతపురం,జులై25(ఆర్ఎన్ఎ): అనంతపురం జిల్లా హిందూపురం పురపాలక సంఘం లో రాయలసీమ మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ అలిన్ భాష సమక్షంలో బుధవారం ఉపాధ్యాయుల బదిలీలు సజావుగా జరిగాయి. పురపాలక సంఘంలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 3, మ్యాథ్స్ 1, హిందీ 1, ఫిజిక్స్ 2, మొత్తం ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 11 మంది పురపాలక సంఘంలో వివిధ పాఠశాలల్లో అదనంగా ఉన్నారు. ఇందులో ఏడుగురు ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలకు బదిలీ చేసి మిగిలిన ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలకు సర్దుబాటు చేశారు.

ఎస్‌జి ఉపాధ్యాయులు ఉర్దూ 10, తెలుగు 8, ఖాళీగా ఉన్నాయి. 17 పోస్టులు అదనంగా ఉన్నాయి. 2 ఉర్దూ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, మిగిలిన 8 తెలుగు పోస్టులు భర్తీ చేయడంతో పాటు మిగిలిన వారిని ఆయా పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఉర్దూ మీడియం బోధించాల్సిన ఉపాధ్యాయుల ఎనిమిది పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. బదిలీల అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ... పురపాలక సంఘంలోని గాంధీ నగర్ లో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 8 తరగతి వరకు తరగతులు ఉన్నాయన్నారు. ఈ పాఠశాలల్లో కేవలం ప్రైమరీ మొదటి తరగతి నుంచి 5 వ తరగతి వరకు మాత్రమే చూపించిన ఉపాధ్యాయులను సైతం వేరే పాఠశాలకు మార్చారని ఆరోపించారు. సర్దు బాటు పేరుతో పాఠశాలలో ఉపాధ్యాయులకు కోత విధించడం తగదని చెప్పారు. సర్దుబాటు అనంతరం రాయలసీమ రీజినల్ డైరెక్టర్ అల్ భాష మాట్లాడుతూ.. పురపాలక సంఘంలో ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేశామన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల నివేదికలను సిద్ధం చేసి వాలంటరీ పోస్ట్ తో వాటిని భర్తీ చేస్తామన్నారు. త్వరలో ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేస్తుందని, అందులో వచ్చే పోస్టులతో అన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్ రావు, అసిస్టెంట్ కమిషనర్ కళప్ప, మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధగిరి శ్రీనివాసులు, నాయకులు పెన్నోబిలం జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యంతో మానవ సంబంధాలు

# నాశనమైపోతున్నాయి

**- అక్కాచెల్లెమ్మల కన్నీళ్లు తుడుస్తానని మాట ఇచ్చా**
**- మద్యం అమ్మకాల బాధ్యత ప్రభుత్వానిదే**
**- గ్రామాల్లో బెల్టు షాపులు పూర్తిగా మూతపడతాయి**
**- ట్విట్టర్‌లో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి**

అమరావతి, జులై25(ఆంఎన్ఎ) : ఏపీలో మద్యపాన నిషేధంపై సీఎం వైఎస్ జగన్ స్పందించారు. దీనిపై ఆయన ట్వీట్ చేశారు. మద్యంతో మానవ సంబంధాలు నాశనమైపోతున్నాయని వాపోయారు. అక్కచెల్లెమ్మల కన్నీళ్లు తుడుస్తానని మాట ఇచ్చానని గుర్తు చేశారు. నిషేధం దిశగా అడుగు లేస్తూ బెల్టు షాపుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. మద్యం అమ్మకాల బాధ్యతను ప్రభుత్వానికే అప్పగిస్తూ చట్టాన్ని తెచ్చామన్నారు. ఆ విధంగా గ్రామాల్లో బెల్టు షాపులు పూర్తిగా మూతబడతాయని సీఎం జగన్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా సీఎం జగన్ కసరత్తు చేస్తున్నారని, ఏపీలో దశలవారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తామని జగన్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 1 నాటికి రాష్ట్రంలోని బెల్ట్ షాపుల్ని పూర్తిగా ఎత్తివేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట మద్యం దుకాణాలు ఉండొద్దన్నారు. దాబాల్లో కూడా లిక్కర్ అమ్మకాలు జరపొద్దన్నారు. సమాజానికి మంచి చేసే నిర్ణయాలు అమల్లో అడుగులు ముందుకు పడాల్సిందే అని జగన్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తొలి విడతలో బెల్ట్ షాపులను ఎత్తేయాలని అధికారులకు సూచించారు. బెల్ట్ షాపులను ఎత్తేయడం వల్ల ఎంత ఆదాయం తగ్గుతుందో అంచనా వేసి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు.

**మద్యపాన నిషేదం ఇదేనా- ట్విట్టర్‌లో లోకేశ్ విమర్శలు**

మద్యపాన నిషేధం అమలుపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన ట్వీట్‌పై మాజీ మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మద్యంతో మానవ సంబంధాలు నాశనమైపోతున్నాయన్న ముఖ్యమంత్రి జగన్.. అమ్మకాల బాధ్యత ప్రభుత్వానిదేనంటూ పొంతనలేని ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం ఏం చెప్పలనుకుంటారోనని లోకేశ్ ఎద్దేవా చేశారు. అలాగే బ్జడెట్‌లో మద్యం అమ్మకాల ఆదాయంపై అంచనాలు గతేడాది కంటే ఎక్కువేశారని, మరి మద్యపాన నిషేధం అంటున్నారని లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అంతేకాదు, వైసీపీ కార్యకర్తలకు కొత్త ఉద్యోగాలు షురూ అయ్యాయని, ఇసుక వాలంటీర్లు, తర్వాత మద్యం వాలంటీర్లు పండగ చేసుకోండి అంటూ ట్విట్టర్‌లో విమర్శలు గుప్పించారు. మొదటి బ్జడెట్లో మద్యం మీద ఆదాయాన్ని గత ఏడాదికన్నా రూ. 2,297 కోట్లు ఎక్కువ అంచనా వేశారని, ఇప్పుడేమో, ప్రభుత్వమే మద్యం షాపులు నడుపుతుంది అంటున్నారని అన్నారు. ఇక మన వైసీపీ కార్యకర్తలకు కొత్త ఉద్యోగాలు షురూ. ఇసుక వాలంటీర్లు తరువాత, మద్యం వాలంటీర్లు.. పండగ చేసుకోండి' అంటూ ట్వీట్ చేశారు. మద్యంతో మానవ సంబంధాలు నాశనమైపోతున్నాయని, మద్యం అమ్మకాల బాధ్యత ప్రభుత్వానిదేనని ఒకదానితో ఒకటి పొంతన లేని స్టేట్మెంట్లు ఇచ్చారని, అనలింతకీ మీరు ఏం చెప్పాలనుకుంటున్నారంటూ లోకేశ్ ప్రశ్నించారు.

# జెడిఎస్‌తో పొత్తును సమర్థించుకున్న కాంగ్రెస్

**ప్రభుత్వం కూలినందుకు చింత లేదన్న శివకుమార్**
**అసమ్మతి ఎమ్మెల్యేల తీరే బాధించిందన్న డికె**

బెంగళూరు,జులై25(ఆర్ఎన్ఎ): జేడీఎస్‌తో పొత్తు పెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినందుకు తామేమీ చింతించడం లేదని కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వంలో తామెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశామని తెలిపారు. అయినా కొందరు పార్టీకి వెన్నుపోటు పొడిచారని అన్నారు. కర్నాటకలో జెడిఎస్‌తో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో మా నిర్ణయం సరైందే అన్నారు. ఇక అధిష్ఠానం ఏది చెప్తే అదే చేస్తాను. ప్రతిపక్షంలో కూర్చోవడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. ఏ బాధ్యత ఇచ్చినా నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నాను. ఎంటీబీ నాగరాజుకు టికెట్ నా వల్లే ఇచ్చారు.

కాంగ్రెస్- జేడీఎస్ కూటమిలో రాజుకున్న అసమ్మతి కారణంగా ప్రభుత్వం కూలిపోగా, దదానిపై ఆయన స్పందించారు. మంగళవారం కర్ణాటక అసెంబ్లీలో జరిగిన బల పరీక్షలో కూటమి సర్కారు ఆరు ఓట్ల తేడాతో ఓటమి పాలైంది. కనీసం ఐదు మంది ఎమ్మెల్యేలను వెనక్కి రప్పించలేకపోయానన్న బాధను వ్యక్తం చేశారు. నా స్నేహితులుగా ఉన్న ఎమ్మెల్యేలే నన్ను వెన్నుపోటు పొడిచారు. నాకే కాదు భాజపాకి కూడా వెన్ను పోటు తప్పదని శివకుమార్ హెచ్చరించారు. తమను కాదనుకున్న వారు రేపు ఇతరులతో కూడా అలా ఉండరని గ్యారెంటీ లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన 16 మంది ఎమ్మెల్యేలు రెండు వారాల క్రితం రాజీనామా చేశారు. వారిని వెనక్కి రప్పించాలని డీకే శివకుమార్ విశ్వప్రయత్నాలు చేశారు. ముంబయిలో అసమ్మతి ఎమ్మెల్యేలు తలదాచుకున్న హోటల్‌కు వెళ్లి వారిని కలిసేందుకు ఎంతో శ్రమించారు. ఎంటీబీ నాగరాజు తన మద్దతును ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ యూటర్న్ తీసుకున్నారు. బల పరీక్ష జరిగే ఆఖరి క్షణం వరకు డీకే శివకుమార్ ఎంతో పోరాడారు. కానీ ఆయన ప్రయత్నం వృథా అయింది. దీంతో సాటి ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. విశ్వాసం లేని చోట ఇలాంటి పరిస్థితి వస్తుందన్నారు.

# నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ఇందుకు అందరూ ముందుకు రావాలి

నిజామాబాద్, జూలై 25 (ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం దేశంలోని 256 జిల్లాల్లో జూలై 1 నుంచి జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ సమన్వయ కర్త డాక్టర్ ఆర్వీఐ బాలాజీ నాయక్ అన్నారు. భవిష్యత్తులో సాగు,తాగు నీటికి ఇబ్బందులు రాకుండా వర్షపు నీటిని చక్కగా వినియోగించుకొని భూగర్భ జలాలు పెంపొందించే చర్యల్లో భాగంగా వనరులను ఉపయోగించుకొని ముందుకు పోవాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి అడుగంటి పోతున్న భూగర్భ జలాలను కాపాడు కుందామని పిలుపునిచ్చారు. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కార్యక్రమాలు సాగుతున్నాయని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, రైతు సమన్వయ సమితి సభ్యులు సమిష్టిగా పాటుపడితే ఫలితాలు సాధించవచ్చన్నారు. ఒక్క అధికార యంత్రాంగంతోనే సాధ్యం కాదని, ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు అందరి సమష్టి కృషి ఉంటేనే విజయం సాధిస్తామని అందుకు ప్రతి ఒక్కరూ జలశక్తి అభియాన్‌లో భాగస్వాములు కావాలన్నారు. రైతులు తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండిచేందుకు మెట్ట భూములు ఆరుతడి పంటలు వేసుకోవాలని, పంట మార్పిడి చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లా వర్షాపాతం బాగా పడిపోయిందన్నారు. నీటి రక్షణ పొదుపుపై అవగాహన పెంచుకోవాలని కోరారు. నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు, కందకాలు, ఊట కుంటలు నిర్మించుకోవాలన్నారు. గ్రామాల్లో నీటి నిలువ, వాటి సంరక్షణ ప్రత్యేకించి తాగునీటికి ఇంకుడుగుంత, ప్రతిరైతు పొలంలో ఒక ఫాంపాండ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# బిజెపి ఎమ్మెల్యేను బ్లాక్‌మెయిల్

## కేసులో జర్నలిస్ట్ అరెస్ట్

న్యూఢిల్లీ, జూలై 25 (ఆర్ఎన్ఎ): బీజేపీ ఎమ్మెల్యేను బ్లాక్ మెయిల్ చేసిన కేసులో నిందితుడైన జర్నలిస్టు విజయ్ శుక్లాను పోలీసులు అరెస్టు చేశారు. గురుగ్రామ్ నగరానికి చెందిన విజయ్ శుక్లా (39) జర్నలిస్టుగా స్థానిక పత్రికతోపాటు వెబ్ పోర్టల్ నడుపుతున్నారు. జర్నలిస్టు విజయ్ శుక్లా తనను రూ.3కోట్లు ఇవ్వాలని కోరాడని, డబ్బు ఇవ్వకుంటే తన పరువు తీస్తూ వార్తలు రాస్తానని బెదిరించాడని గురుగ్రావ్ ఎమ్మెల్యే అగర్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జులై 11వతేదీన తనను కలిసి విజయ్ శుక్లా డబ్బు విషయమై బేరసారాలు ఆడాడని, అనంతరం తన వ్యతిరేకుల నుంచి డబ్బు తీసుకొని తనకు వ్యతిరేకంగా వార్తలు రాశాడని ఎమ్మెల్యే అగర్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేర తాము జర్నలిస్టు విజయ్ శుక్లాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నావని ఏసీపీ ముఖేష్ జాఖర్ చెప్పారు.

# అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎంపిలు

## ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరిక
## సిఎం కెసిఆర్ దీనిపై స్పందించాలి
## బండి సంజయ్, ధర్మపురి అర్వింద్

న్యూఢిల్లీ,జూలై25(ఆర్ఎన్ఎ): కరీంనగర్‌లో అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై సిఎం కెసిఆర్ స్పందించి సమాధానం చెప్పాలని బిజెపి ఎంపిలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్‌లు డిమాండ్ చేశారు. పార్లమెంట్ హౌజ్ వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ అక్బరుద్దీన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 15 నిమిషాల సమయమిస్తే హిందువుల అంతు తేలుస్తాను' అంటూ మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మాటి మాటికి రెచ్చగొట్టే ప్రకటనలు చేయడంపై తీవ్రంగా స్పందించారు. '15 నిమిషాలు కాదు.. 15 గంటలు.. 15 రోజులు.. 15 నెలలు.. 15 ఏళ్లు ఇచ్చినా ఏమీ చేయలేవని గుర్తుంచుకో' అని అక్బర్‌ను హెచ్చరించారు. మేము తలచుకుంటే 15 సెకన్లలో చేస్తామని హెచ్చరించారు. ఎదురుగా వస్తే సత్తా ఏమిటో తేల్చుకుందాం.. రా.. ఎక్కడో.. ఎప్పుడో.. చెప్పు' అంటూ అక్బర్‌కు సవాల్ విసిరారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తే గట్టిగా బుద్ధి చెబుతామన్నారు. కాగా, 'మీరు 15 నిమిషాల గురించి గుర్తు చేస్తే.. మేము సెకన్ల గురించి మాట్లాడాల్సి వస్తుంది' అని అక్బర్‌ను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హెచ్చరించారు. మజ్లిస్ నాయకుడు డిప్యూటీ మేయర్‌గా ఉన్నప్పుడు కరీంనగర్‌లో జరిగిన మతపరమైన అలర్లు ప్రజలకు తెలునన్నారు. 2011లో భారత్, పాకిస్థాన్ మధ్య వరల్డ్ కప్ మ్యాచ్ సందర్భంగా జరిగిన గొడవలను కరీంనగర్ ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. రానున్న మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే బీజేపీ చూసన్తా ఊరుకోదన్నారు. అక్బర్ తీరు 'కుక్కతోక వంకర' అన్న సామెతను గుర్తు చేస్తోందని విమర్శించారు. అక్బర్ మాట్లాడిన వీడియోను పరిశీలిస్తున్నామని, రెచ్చగొట్టే వ్యాఖ్యలుంటే కేంద్ర హోం మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో ఏమీ చేయలేరని ధర్మపురి అర్వింద్ అన్నారు. నీ పహిల్వాన్ వ్యవహారం బిజెపి ముందు కాదన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి

జనగామ,జూలై25(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులుకూడా తమ గ్రామాల్లో ఈ పథకానలు చేరవేయాలన్నారు. ప్రలజ వద్దకు వెళ్లి అందుతున్న పథకాలపై ఆరా తీయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశించిన మేరకు సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని, లబ్దిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. అంకితభావం, సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి పేరుప్రతిష్టలు తీసుకురావాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంక్షేమ పథకాలు, కార్పొరేషన్ రుణాల దరఖాస్తు చేసుకోవాలనే అంశాలపై సంబంధిత అధికారులు పెద్దఎత్తున ప్రచారం చేయాలని ఆదేశించారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంతోపాటు పూర్తిస్థాయిలో రక్షణ, వసతి సౌకర్యం కల్పించినప్పుడే ఆశించిన మేరకు విద్యార్థులు వసతి పొందుతారని వివరించారు.

# పెరోల్‌పై విడుదలైన నళిని

చెన్నై,జూలై 25(ఆర్ఎన్ఎ): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో జీవితకాల జైలు శిక్షను అనుభవిస్తున్న ఎస్.నళిని శ్రీహరన్ పెరోల్‌పై విడుదల అయ్యింది. వెల్లూర్ సెంట్రల్ జైలు నుంచి గురువారం ఆమె బయటకు వచ్చారు. నెల రోజుల పెరోల్‌పై ఆమె విడుదల అయ్యారు. కూతురు పెళ్లి కారణంగా నళినికి పెరోల్ మంజూరీ చేశారు. ఈనెల 5వ తేదీన మద్రాస్ హైకోర్టు ఆమెకు పెరోల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 161 ప్రకారం 20 ఏళ్లు శిక్ష పూర్తి చేసుకున్న వారిని విడుదల చేయవచ్చు అంటూ 1994లో ప్రభుత్వం ఓ స్కీమ్‌ను తీసుకువచ్చింది. దాని ప్రకారం రిలీజ్ చేయాలంటూ నళిని ఇటీవల తన పిటిషన్‌లో వేడుకున్నది. తన కుమార్తె పెండ్లి కోసం 6 నెలల సాధారణ సెలవులివ్వాలని కోరుతూ నళిని సుప్రీంకోర్టులో ఇటీవల పిటిషన్ వేశారు. 27 ఏండ్లుగా జైలు జీవితం గడుపుతున్న ఆమె.. తన లీవ్ పిటిషన్‌పై స్వయంగా వాదించేందుకు తనను సుప్రీం కోర్టులో హాజరుపరిచేలా ఎస్పీని ఆదేశించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆమె వాదనలు ఎలా ఉన్నాకూతురి పెళల్ఇ కోసం ఆమెకు పెరోల్ మంజూరు చేసింది. కూతురు లండన్‌లో ఉంటోంది.

# మారనున్న టీమిండియా జెర్సీ

## ఒప్పో స్థానంలో బైజూస్ ఒప్పందం

న్యూఢిల్లీ, జూలై 25 (ఆర్ఎన్ఎ): త్వరలో టీమిండియా జెర్సీ బ్రాండ్ మారనున్నంది. దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్ నుంచి టీమిండియా ఆటగాళ్ల జెర్సీలపై ఒప్పో బ్రాండ్‌కు బదులు కొత్త బ్రాండ్ దర్శనమివ్వనుంది. ప్రస్తుతం టీమిండియాకు స్పాన్సర్ చేస్తున్న చైనాకు చెందిన మొబైల్ సంస్థ ఒప్పో స్పాన్సర్‌షిప్‌ను రద్దు చేసుకుంటున్నట్లు సమాచారం. చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్ సంస్థ ఒప్పో.. 2017 మార్చిలో టీమిండియా స్పాన్సర్‌షిప్‌ను రూ.1079 కోట్లకు ఐదేళ్ల పాటు అగ్రిమెంట్ కుదుర్చుకుంది. అయితే ఒప్పో సంస్థ తమ స్పాన్సర్‌షిప్‌ను రద్దు చేసుకుందని, 2017లో అధిక వ్యయానికి ఒప్పందం కుదుర్చుకున్నామనే కారణంతో తప్పుకోవాలని చూస్తోందట. అంత మొత్తంలో తాము చెల్లించలేమనే ఒప్పో తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే ఒప్పో స్థానంలో అదే టైం పిరియడ్ కి అంతే మొత్తంలో బీసీసీఐకి చెల్లించడానికి బెంగళూరుకు చెందిన ఆన్‌లైన్ ట్యుటోరియల్ సంస్థ బైజుస్ సంస్థ ముందుకు వచ్చింది. సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యే దక్షిణాఫ్రికా పర్యటన నుంచి బైజుస్ తన బ్రాండ్‌ను కొనసాగించనుంది. దీంతో టీమిండియా ఆటగాళ్ల జెర్సీలపై ఒప్పో బ్రాండ్‌కు బదులు త్వరలో కొత్త బ్రాండ్ దర్శనమివ్వబోతోంది. వచ్చేనెల ఆగస్టులో వెస్టిండీస్ పర్యటన వరకే కోహ్లిసేన జెర్సీలపై ఒప్పో బ్రాండ్ కనిపిస్తుంది. ఆగస్టు 3 నుంచి మూడు టీ20లు, మూడు వన్డేలతో పాటు రెండు టెస్టులు ఆడనుంది. ఈ పర్యటన సెప్టెంబర్ 2న పూర్తవుతుంది. సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యే దక్షిణాఫ్రికా పర్యటన నుంచి బెంగళూరుకు చెందిన ఆన్‌లైన్ ట్యుటోరియల్ సంస్థ బైజుస్ తన బ్రాండ్‌ను కొనసాగించనుంది. దీంతో సెప్టెంబర్ నుంచి 2022 మార్చి వరకు బైజుస్ స్పాన్సర్‌షిప్ చేస్తుందని తెలిపింది. కాగా టీమిండియా ఆడే ద్వైపాక్షిక మ్యాచ్‌లకు ఒప్పో సంస్థ ఒక్క రోజుకు రూ 4.61 కోట్లు చెల్లించగా ఐసీసీ ఈవెంట్లకు రూ.1.56 కోట్లు చెల్లించేది. అంతకుముందు స్టార్ ఇండియా ఒక్కో మ్యాచ్‌కు 1.92 కోట్లు చెల్లించగా ఐసీసీ ఈవెంట్లకు రూ.61 లక్షలు మాత్రమే చెల్లించేదని తెలుస్తోంది.

# గ్రామాలను పచ్చగా తీర్చిదిద్దండి: ఎమ్మెల్యే

కామారెడ్డి,జూలై 25 (ఆర్ఎన్ఎ): ప్రతీ గ్రామాన్ని నందనవనంలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులదేనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. అన్ని మండలాల్లోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు ఉమ్మడిగా హరితహారం కింద మొక్కలు నాటాన్నారు. గ్రామాలను పచ్చగా ఉంచుకోవాలన్నారు. పారిశద్యం కోసం పనిచేయాలన్నారు. అప్పుడే నిధుల విడుదలకు అవకాశం ఉంటుందని అన్నారు. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కృషిచేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో 40 వేల మొక్కలను నాటాలని, నాటిన మొక్కల్లో 85 శాతం మొక్కలను తప్పనిసరిగా సంరక్షించాలని అన్నారు. ప్రతిగ్రామంలో 85 శాతం పచ్చదనం కనిపించేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. రైతులు తమ పొలం గట్లపై శ్రీ గంధం, ఎర్ర చందనం చెట్లు నాటేందుకు ముందుకు రావాలని, తెలిపారు.

# జిల్లా పోలీసుల పనితీరు ప్రశంసనీయం

## మావోయిస్ట్ ప్రాంతంలో సమర్థంగా విధులు
## జిల్లా పోలీస్ అధికారుల సమీక్షలో డిజిపి

భద్రదాద్రికొత్తగూడెం,జులై25 (ఆర్ఎన్ఎ): మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్ల ఆపోలీస్ యంత్రాంగం బాగా పనిచేస్తోందని డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. అన్ని రకాల ఎన్నికలను సమర్థవంతంగా పూర్తి చేయడంలో అధికారుల పని తీరు ప్రశంశనీయమన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల పర్యటనలో భాగంగా డీజీపీ మహేందర్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్ కు మంగళవారం చేరుకున్నారు. బుధవారం ఉదయం పోలీసు అధికారులతో డీజీపీ మహేందర్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా అధికారుల పనితీరును సమీక్షలో డీజీపీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో డీజీపీ మాట్లాడుతూ.., మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పూర్తి సమాచారాన్ని సేకరించాలని డీజీపీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చి ప్రజలలో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాలని కోరారు. ఎస్పీతదితర అధికారులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకే కార్డెన్ సర్చ్

## కమిషనర్ ఆధ్వర్యంలో తనిఖీలు

కరీంనగర్,జూలై25 (ఆర్ఎన్ఎ): నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని కోతి రాంపూర్ హనుమాననగర్‌లో పోలీసులు నిర్బంద తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో 300 మంది పోలీసులు పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 55 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అనుమతి లేకుండా నిల్వచేసిన మద్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుపై సీపీ స్థానికులకు అవగాహన కల్పించారు. స్థానికంగా నివాసం ఉంటున్న ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఎవరైనా చుట్టుపక్కల తెలియని వారు వస్తే పోలీసులకు వారి సమాచారం అందించాలని సీపీ సూచించారు. కాలనీలోని ఇండ్లలో తనిఖీలు చేపట్టారు. అనుమానితులను విచారించటంతో పాటు పాత నేరస్తులపై ఆరాతీశారు. నంబర్లులేని, ఎలాంటి డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరిచయం లేని వారికి ఇండ్లు అద్దెకు ఇవ్వకూడదని సూచించారు. ప్రతి కాలనీలో వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీపీ వివరించారు.



కరీంనగర్ జిల్లాలోని కోతి రాంపూర్ హనుమాన్‌నగర్‌లో పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్బంద తనిఖీలు నిర్వహించిన పోలీసులు.

# అదృశ్యమైన ముగ్గురు పిల్లలు క్షేమం

## దొంగచాటుగా తీసుకెళ్లిన తండ్రి

హైదరాబాద్,జులై25 (ఆంఎన్ఎ): కార్ఖానా పీఎస్ పరిధిలో అదృశ్యమైన ముగ్గురు పిల్లల కేసును పోలీసులు ఛేదించారు. కన్నతండ్రే ముగ్గురు కూతుళ్లను తీసుకువెళ్లినట్లు నిర్ధారించారు. కాకాగూడ బస్తీలో నివాసం ఉంటున్న సయ్యద్ షాబానా–చాంద్ పాషాలకు ముగ్గురు సంతానం ఉన్నారు. గొడవల కారణంగా 4 సంవత్సరాల నుంచి షాబానా ముగ్గురు కూతుళ్లతో కలిసి ఒంటరిగా ఉంటున్నారు. పిల్లలు తనకే కావాలన్న ఉద్దేశంతో తండ్రి చాంద్ పాషా వాళ్లను తనవెంట తీసుకెళ్లాడు. పిల్లలు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి షాబానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. తండ్రీకూతుళ్లను నల్గొండలో గుర్తించారు. పిల్లల్ని తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

# మొక్కలు నాటి.. పర్యావరణాన్ని కాపాడాలి



నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

## – భవిష్యత్ తరాలు బాగుకోసం మొక్కలు నాటడం తప్పనిసరి
## – నాటిన మొక్కలను పరిరక్షించే బాధ్యతను తీసుకోవాలి
## – మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, జులై25(ఆర్ఎన్ఎ) : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గురువారం సోన్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో పచ్చని చెట్లే కీలకమన్నారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యత కాపాడటంలో చెట్లు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు.

వర్షాలు కురిసి భవిష్యత్ తరాలు బాగుండాలంటే మొక్కలు నాటడం తప్పనిసరన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే భాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. హరితహారంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు తమ కార్యాలయల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక తయారు చేయాలని, రాహదారులతోపాటు వ్యవసాయ రైతులకు చెందిన వ్యవసాయ భూమిలోని గట్లపై శ్రీగంధం మొక్కలతోపాటు వెదురు మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. వ్యవసాయ భూముల్లో నిర్వహించే హరితహారం కార్యక్రమాలపై గ్రామాల్లోని రైతులకు తమ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలని, నాటిన ప్రతి మొక్కకు పూర్తి రక్షణ చర్యలు తీసుకోవాలని, మొక్కలు ఎండిపోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. ప్రశాంతి, ఎస్పీ శశిధర్ రాజు, జడ్పీటీసీ జీవన్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున రెడ్డి, మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

# షరియత్ చట్టంలో లోపాలను సరిచేస్తాం

## – మహిళ భద్రత, సమానత్వం కోసం ట్రిపుల్ తలాక్ బిల్లును తెచ్చాం
## – లోక్‌సభలో కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ, జులై25(ఆంఎన్ఎ): ఇస్లాం మతానికి చెందిన షరియత్ చట్టంలో సరిగా లేని అంశాలను.. చట్ట పరంగా సరిచేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లుపై గురువారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు.. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధంగా ఉందని, దాన్ని రద్దు చేయాలని ఓ న్యాయమూర్తి చెప్పినట్లు మంత్రి తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టానికి వ్యతిరేకంగా ఉందని, దానికి వ్యతిరేకంగా చట్టం చేయాలని న్యాయమూర్తులు సూచించినట్లు మంత్రి చెప్పారు. యూపీలో ఓ ముస్లిం మహిళకు ట్రిపుల్ తలాక్ ఇచ్చిన పద్ధతిని మంత్రి సభలో వివరించారు. పొగాకుతో దంతాలు శుభ్రం చేసే అలవాటు ఉన్న ఆ మహిళకు తలాక్ ఇచ్చారన్నారు. కానీ పెళ్లి అయిన నాటి నుంచి భర్త, మరుదులు వరకట్నం కావాలంటూ వేధిస్తున్నారని ఆ మహిళ ఫిర్యాదు చేసినందని మంత్రి చెప్పారు. మతంతో సంబంధం లేకుండా, చట్టం ముందు మహిళలందరూ సమానమే అని మంత్రి అన్నారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా అనేక దేశాలు చట్టాలు చేస్తున్నాయన్నారు.

# కశ్మీర్ ఆర్మీ బెటాలియన్‌తో ధోనీ..



హైదరాబాద్: క్రికెటర్ ధోనీ.. ఇప్పుడు లెఫ్టినెంట్ కల్నల్ బాధ్యతలు చేపట్టనున్నాడు.

కశ్మీర్‌లో ఉద్యోగం చేసేందుకు అతను వెళ్తున్నాడు. వెస్టిండీస్ టూర్‌కు దూరంగా ఉన్న ధోనీ.. ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు 106 టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్‌తో కలిసి ధోనీ పనిచేయనున్నాడు. కశ్మీర్‌లో ఉన్న విక్టర్ ఫోర్స్‌తో క్రికెటర్ కలవనున్నాడు.

పెట్రోలింగ్, గార్డ్, పోస్ట్ డ్యూటీలను ధోనీ నిర్వర్తిస్తాడు. కల్నల్ ధోనీ.. అక్కడే భద్రతా దళాలతో 15 రోజులు గడపనున్నాడు. క్రికెట్‌కు ధోనీ ఇప్పుడే వీడ్కోలు పలకట్లేదని, పారామిలటరీ రెజిమెంట్‌లో సేవలందించేందుకు రెండు నెలల సెలవు మాత్రమే తీసుకుంటున్నట్లు ఇటీవల బీసీసీఐ వెల్లడించింది.

# 800 అనే టైటిల్‌తో మురళీధరన్ బయోపిక్ ..!






బాలీవుడ్‌లో స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంతో పలు చిత్రాలు తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాలకి మంచి ఆదరణ లభిస్తుండడంతో పలువురు స్పోర్ట్స్ పర్సనాలిటీస్ జీవిత నేపథ్యంలో సినిమాలు వస్తూనే ఉన్నాయి. 1983 వరల్డ్‌కప్ ఫైనల్లో అప్పటి డిఫెండింగ్ చాంపియన్ వెస్టిండీస్‌ను ఓడించి తొలిసారి టీమిండియా విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఆ టీమ్ సక్సెస్ స్టోరీ ఆధారంగా 83 మూవీ రూపొందుతుంది. ఇక తాజాగా శ్రీలంక స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవిత నేపథ్యంలోను సినిమా చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ బయోపిక్‌లో ముత్తయ్యగా విజయ్ సేతుపతి నటించబోతున్నారు. శ్రీపతి రంగస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి 800 అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. టెస్ట్ క్రికెట్‌లో మురళీధరన్ 800 వికెట్స్ సాధించగా, ఆ నెంబర్‌తోనే సినిమా రూపొందనుందని అంటున్నారు . ముత్తయ్య మురళీధరన్ తమిళ సంతతికి చెందిన స్పోర్ట్స్ పర్సన్ కాగా, ఆయన పాత్రలో నటించడం సవాల్ లాంటిదని విజయ్ అంటున్నారు. ఈ చిత్రాన్ని థార్ మోషన్ పిక్చర్స్ నిర్మించనుంది. బాల్‌ని మెలికలు తిప్పుతూ కళ్ళతో బ్యాట్స్‌మెన్‌ని భయపెట్టించే మురళీధరన్ బయోపిక్ విజయవంతం కావాలని మనం అందరం కోరుకుందాం.

### షాద్‌నగర్ జంట హత్యలకేసులో...

# రామసుబ్బారెడ్డికి క్లీన్‌చిట్

**- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు**

**- 29ఏళ్ల కేసును కొట్టేసిన సర్వోన్నత న్యాయస్థానం**

న్యూఢిల్లీ, జులై25(ఆర్ఎన్ఎ) : ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 1990 నాటి షాద్‌నగర్ జంట హత్యల కేసులో గురువారం సుప్రీంకోర్టు తుదితీర్పును వెల్లడించింది. ఈ కేసులో మాజీ మంత్రి, టీడీపీ నేత రామసుబ్బారెడ్డిని నిర్దోషిగా పేర్కొంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. 29 ఏళ్లుగా నడుస్తోన్న ఈ కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో నాటి కార్మికశాఖ మంత్రి శివారెడ్డి, మండలి విప్ రామసుబ్బారెడ్డి సహా తొమ్మిది మంది నిందితులుగా ఉన్నారు. అయితే ఆదినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి కుటుంబాల మధ్య దశాబ్దాలుగా ప్రత్యక్ష యుద్ధం జరుగుతోంది. 1990 డిసెంబర్ 5న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ బస్టాండ్‌లో కాంగ్రెస్ నేతలు దేవగుడి శివశంకర్ రెడ్డి, బీమగుండం గోపాల్‌రెడ్డిలను ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. శివశంకర్ రెడ్డి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డికి స్వయానా బాబాయి. వీరిని రామసుబ్బారెడ్డి, ఆయన చిన్నాన్న మాజీ మంత్రి శివారెడ్డి షాద్‌నగర్ వద్ద హత్య చేయించినట్లు ఆరోపణలు వచ్చాయి.

ఈ హత్య జరిగిన కొద్ది రోజుల్లోనే ఓ వివాహానికి వెళ్లి వస్తుండగా మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట వద్ద రామసుబ్బారెడ్డి బాబాయి శివారెడ్డి హత్యకు గురయ్యారు. ఈ ఘటన జరిగిన కొన్నాళ్లకే ఆయన కుమారుడు సోమశేఖర్‌రెడ్డిని కూడా హత్య చేశారు. దీంతో జమ్మలమడుగులో ఆదినారాయణ రెడ్డి, రామసుబ్బారెడ్డి మధ్య దశాబ్దాలపాటు వైరం కొనసాగింది. ఇక, శివారెడ్డి హత్య తర్వాత 1994లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన రామసుబ్బారెడ్డి.. జమ్మలమడుగు నుంచి బరిలోకి దిగి ఆదినారాయణరెడ్డి సోదరుడు నారాయణరెడ్డిపై విజయం సాధించారు. తర్వాత చంద్రబాబు మంత్రివర్గంలో అటవీశాఖ మంత్రిగా పనిచేశారు. అయితే, శంకర్‌రెడ్డి హత్య కేసులో రామసుబ్బారెడ్డికి నాంపల్లి కోర్టు జీవితఖైదు విధించింది. దీంతో ఆయన దాదాపు రెండేళ్లు చెంచల్‌గూడ జైల్లో శిక్షను అనుభవించారు. రామసుబ్బారెడ్డి హైకోర్టుకు అప్పీలు చేయగా ఆయనను నిర్దోషిగా పేర్కొంటూ కేసును కొట్టేసింది. ఈ తీర్పును ఆదినారాయణ రెడ్డి వర్గీయులు 2008లో సుప్రీంకోర్టులో సవాల్ చేయడంతో సుదీర్ఘ వాదనల తర్వాత గురువారం తుది తీర్పు వెలువరించింది. వాస్తవానికి ఈ కేసులో తీర్పు గతేడాది అక్టోబరులోనే వెలువడాల్సి ఉండగా, పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. తొలుత జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి ధర్మాసనాన్ని తప్పించి మరో దానికి బదిలీచేశారు. కడప జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసిన ఈ కేసులో 1987 ఎంపీపీ ఎన్నికలలో అధ్యక్షపదవికి పోటీ చేసిన భీమగుండం గోపాలరెడ్డి భార్య, నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న శివారెడ్డి భార్యను ఓడించి, జమ్ములమడుగులో శివారెడ్డి ఆధిపత్యానికి సవాల్ విసిరిందని, అందువల్లనే ఈ హత్యలు జరిగాయని ప్రచారం జరిగింది.

### బ్రిటన్ కొత్త కేబినెట్‌లో..

# నారాయణమూర్తి అల్లుడు




## - మరో ఇద్దరు భారత సంతతి వ్యక్తులకు కేబినెట్‌లో చోటు

లండన్, జులై25(ఆర్ఎన్ఎ) : ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అల్లుడు రిషి సునక్‌కు యూకే ప్రభుత్వంలో కీలక పదవి దక్కింది. బ్రిటన్ నూతన ప్రధానిగా కన్జర్వేటివ్ పార్టీ సీనియర్ నేత బోరిస్ జాన్సన్ బుధవారం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. అనంతరం కేబినెట్ కూర్పు జరిగింది. రిషి సునక్ సహా మరో ఇద్దరు భారత సంతతి వ్యక్తులకు దీనిలో చోటు కల్పించారు. రిషి సునక్‌ను ట్రెజరీ విభాగ చీఫ్ సెక్రటరీగా నియమించినట్లు యూకే ప్రధాని కార్యాలయం వెల్లడించింది. 39ఏళ్ల రిషి.. ఇంగ్లాండ్‌లో హాంప్‌షైర్ కౌంటీలో జన్మించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసి.. 2014లో రాజకీయాల్లోకి వచ్చారు. 2015లో జరిగిన ఎన్నికల్లో యార్క్‌షైర్‌లోని రిచ్‌మాండ్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. గతంలో థెరిసా మే ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో ఎంబీఏ చదివే రోజుల్లో సహ విద్యార్థిని అయిన నారాయణ మూర్తి కుమార్తె అక్షతా మూర్తిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. చీఫ్ సెక్రటరీ హోదాలో రిషి కేబినెట్ సమావేశాలకు హాజరుకానున్నారు. ఇక రిషితో పాటు భారత సంతతికి చెందిన అలోక్ శర్మ, ప్రీతి పటేల్‌కు కేబినెట్‌లో స్థానం దక్కింది. యూపీలోని ఆగ్రాలో పుట్టిన శర్మ.. బ్రిటన్‌లో స్థిరపడ్డారు. 2010 నుంచి రీడింగ్ వెస్ట్ నియోజకవర్గానికి ఎంపీగా కొనసాగుతున్నారు. థెరిసా మే ప్రభుత్వంలో పర్యావరణ మంత్రిగా చేసిన అలోక్ శర్మ.. తాజా కేబినెట్‌లో ఇంటర్నల్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా నియమితులయ్యారు. భారత సంతతికి చెందిన ప్రీతి పటేల్ కొత్త కేబినెట్‌లో హోం సెక్రటరీగా నియమితులయ్యారు.

## కొత్త ప్రభుత్వం కూడా స్థిరంగా ఉండలేదు

**అధికారులకు కృతజ్ఞతలు చెప్పిన కుమార**

బెంగళూరు,జులై24 (ఆర్ఎన్ఎ): కర్నాటకలో ఏర్పడే కొత్త ప్రభుత్వం కూడా అస్థిరంగానే ఉంటుందని బలపరీక్షలో ఓడిన కర్నాటక మాజీ సీఎం కుమారస్వామి మీడియాతో అన్నారు. కొత్త ప్రభుత్వానికి కూడా సవాళ్లు తప్పవని అన్నారు. భవిష్యత్తులోనూ ప్రభుత్వం అస్థిరంగానే ఉంటుందన్నారు. గవర్నర్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించినా.. వచ్చే ప్రభుత్వం కూడా స్థిరంగా ఉండదని కుమారస్వామి అన్నారు. అస్థిర రాజకీయాల మధ్య రాష్ట్ర అభివృద్ధిని విస్మరించరాదని సీనియర్ ఆఫీసర్లతో కుమారస్వామి తెలిపారు. బలపరీక్షలో ఓడిన తర్వాత బుధవారం మాజీ సీఎం ఆ రాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్నాళ్లూ సహకరించిన ఆఫీసర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రతినిధుల కన్నా ఆఫీసర్ల బాధ్యతే కీలకమైందన్నారు. సాధారణ పౌరుల బాగోగులు అధికారులే చూసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులపై ఆధారపడకూడదన్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పుడు.. రైతు రుణాలను ఎత్తివేయాలని భావించాను, దాని కోసమే రుణ విముక్తి చట్టాన్ని తేవాలనుకున్నట్లు కుమారస్వామి చెప్పారు. తమ ప్రతిపాదనను రాష్ట్రపతికి పంపామని, ఆయన దానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు మాజీ సీఎం చెప్పారు.- మరో ఇద్దరు భారత సంతతి వ్యక్తులకు కేబినెట్‌లో చోటు

# అక్బరుద్దీన్ ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడు

**- ఉన్న జీవితాన్నికూడా పోగొట్టుకుంటావ్!**

**- ఓటుబ్యాంకు రాజకీయాలకోసమే బీజేపీపై ఆరోపణలు**

**- కేసీఆర్ పాముకు పాలుపట్టి పోషిస్తున్నాడు**

**- హిందులను చంపేస్తానన్న ఎంఐఎంతో టీఆర్ఎస్ కలిసినడుస్తుంది**

**- బీజేపీ ఎంపీలు అర్వింద్, సంజయ్**

న్యూఢిల్లీ, జులై25(ఆర్ఎన్ఎ) : బీజేపీ ఆరెస్సెస్ మీద ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీలు బండి సంజయ్, అరవింద్‌లు ఖండించారు. ఈసందర్భంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ.. ప్రజలు దురదృష్టవశాత్తు మిమ్మల్ని ఎన్నుకున్నారని అన్నారు. ముస్లిం పేరుతో అన్నదమ్ములు ఇద్దరు పబ్బం గడుపుతున్నారని, ప్రస్తుతం టీఆరెస్ తో కుమ్మక్కై ఇలా వ్యవహరిస్తున్నారని అర్వింద్ విమర్శించారు. మత రాజకీయాలకు తెర తీస్తోందని ఆయన అన్నారు.

అక్బరుద్దీన్ ఓవైసీ గురించి మాట్లాడుతూ.. ఏప్రిల్ 20న నీ ఇలాఖాలోనే ఏం జరిగిందో గుర్తు లేదా అని ప్రశ్నించారు. మీ వాళ్ళు నిన్ను పొడిచి కిడ్నీలు, అవయవాలు అన్ని డీలా అయ్యేలాగా చేసిన విషయం గుర్తుకు రాలేదా అంటూ అర్వింద్ గతాన్ని గుర్తు చేశారు. 80శాతం హిందువులు ఉన్న వారి గురించి మళ్ళీ చూసుకోవచ్చు కానీ మీ వాళ్ళ గురించి చూసుకోమని హెచ్చరించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ఉండాలని, లేదంటే ట్రీట్మెంట్ ఫెయిల్ అయ్యి ఉన్న జీవితం కూడా పోగొట్టుకుంటావని అక్బరుద్దీన్ను అర్వింద్ హెచ్చరించారు.

**ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఆరోపణలు - ఎంపీ సంజయ్**

ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బీజేపీ మీద ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ ఎంపీ బండి సంజయ్ మండిపడ్డారు. టీఆర్ఎస్, ఎంఐఎం మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని, కేసీఆర్ పాముకు పాలుపెట్టి పోషిస్తున్నారని విమర్శించారు. హిందువులను చంపేస్తామన్న పార్టీతో టీఆర్ఎస్ ఎలా దోస్తీ చేస్తోందని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు.

టీఆర్ఎస్, ఎంఐఎం లు ఇద్దరూ కలసి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కరీంనగర్ లో కార్పొరేషన్ లు ఎంఐఎం పార్టీ కి ఎక్కువ ఇచ్చేలాగా టీఆర్ఎస్ తో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆయన అన్నారు. చాయ్ అమ్ముకునే వ్యక్తి ప్రధానమంత్రి అయ్యారని విమర్శిస్తున్న అక్బరుద్దీన్ వ్యాఖ్యలకు కౌంటర్ గా ప్రజాస్వామ్య దేశంలో ప్రధానమంత్రి అయ్యే అవకాశం అందరికీ ఉందని, ఎవరైనా ప్రధాని అవ్వచ్చని అన్నారు. దేశంలో దేశ భక్తులు రాజ్యం నడుస్తోందని అన్నారు. ముస్లిం మహిళలు బాగు కోసం మోడీ ట్రిపుల్ తలాక్ ని చట్ట బద్దం చేయడం కోసం కృషి చేస్తుంటే.. వారి మహిళలకు వ్యతిరేకంగా ఎంఐఎం వ్యవహరిస్తోందని అన్నారు. 15 నిమిషాల సమయం ఇస్తే.. హిందువుల అంతు చూస్తా అన్న అక్బరుద్దీన్ను తీవ్రంగా హెచ్చరించారు. తమకు కేవలం ఒక్కసెకెన్ చాలని, కాని తాము ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తాం అని తెలిపారు. హిందువులను చంపేస్తాం అన్న పార్టీ తో టీఆరెస్ దోస్తీ కట్టాలని చూస్తుందని.. ఈ విషయంపై టీఆరెస్ కార్యకర్తలు ఆలోచించాలని సూచించారు. రానున్న ఎన్నికలలో కాషాయ జెండా మాత్రమే ఎగరబోతుందని ఆయన అన్నారు.

# నకిలీ పత్రాలతో బ్యాంకుకు బురిడీ

## ముగ్గురు సోదరుల అరెస్ట్

హైదరాబాద్,జూలై25 (ఆర్ఎన్ఎ): నకిలీ పత్రాలతో ఓ జాతీయ బ్యాంకును మోసం చేసి, రూ.5 కోట్ల రుణం తీసుకున్న కేసులో మరో ముగ్గురు నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. 2016లో ఈ కేసు నమోదు అయిన తరువాత.. ప్రధాన సూత్రధారి విమల్ గోయల్‌ను 2017లో అరెస్ట్ చేశారు. తాజాగా.. బోగస్ పత్రాలు సృష్టించిన బాలాపూర్‌కు చెందిన అన్నదమ్ములు బాబూరావు, ఇంద్రకరణ్, శ్రీకాంత్‌లను అరెస్ట్ చేశారు. అన్నదమ్ములు తమ పూర్వీకులకు సంబంధించిన భూమిని విక్రయించిన తరువాత, కొన్నవారి పేరుపై రెవెన్యూలో రికార్డు మారలేదు. దీన్ని ఆసరాగా చేసుకున్న ఈ ముగ్గురు విక్రయించిన భూమికే.. తిరిగి ఓ రెవెన్యూ ఉద్యోగి సహకారంతో నకిలీ పత్రాలు తయారు చేసి, వాటిని గోయల్‌కు విక్రయించారు. ఇదంతా గోయల్, బాబూరావు సోదరులు వేసుకున్న పథకంలోనే జరిగింది. ఈ పత్రాలను సెక్యూరిటీ సిండికేట్ బ్యాంకులో పెట్టి రెండు దఫాలుగా రూ.5 కోట్ల చొప్పున గోయల్ రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణానికి సంబంధించిన వాయిదాలు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు దీనిపై ఆరా తీయడంతో బోగస్ పత్రాలతో బ్యాంకుకు బురిడీ కొట్టించారని నిర్ధారించుకొని బ్యాంకు అధికారులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నకిలీ పత్రాలను పరిశీలించకుండా, రుణాన్ని ఇవ్వడంలో న్యాయసలహాలు ఇచ్చిన లీగల్ అడ్వైజర్‌తో పాటు, సిండికేట్ బ్యాంకు డీజీఎంలతో పాటు మరో ముగ్గురికి నోటీసులు జారీ చేశారు. నకిలీ పత్రాలను సృష్టించిన ముగ్గురు సోదరులను తాజాగా ఈ కేసులో అరెస్ట్ చేశారు.

# రెండు బస్సులు ఢీ: ముగ్గురు మృతి

గౌహతి,జులై25(ఆర్ఎన్ఎ): అసోంలో ఘోర ప్రమాదం జరిగింది. కరీంగంజ్‌లోని ఓ ప్రధాన రహదారిపై వెళ్తున్న రెండు మినీబస్సులు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా..30 మందికిపైగా గాయాలయ్యాయి. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, అధికార యంత్రాంగం గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించారు. రెండు బస్సుల వేగం ఎక్కువగా ఉండటంతో అవి రహదారిపై పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లాయి.

సినిమా..

# డియర్ కామ్రేడ్ హిందీ రీమేక్‌లో దఢఖ్ జంట !



బాలీవుడ్‌లో రీమేక్ ట్రెండ్ కొనసాగుతూనే ఉంది. సౌత్‌లో మంచి హిట్ సాధించిన చాలా చిత్రాలు ఇప్పుడు హిందీలో రీమేక్ అవుతున్నాయి. తాజాగా డియర్ కామ్రేడ్ చిత్రాన్ని బాలీవుడ్ బడా ప్రొడ్యూసర్ కరణ్ జోహార్ రీమేక్ చేసేందుకు సిద్ధమయ్యారు . రీసెంట్‌గా విజయ్ తో పాటు చిత్ర నిర్మాతలతో కలిసి చిత్రాన్ని వీక్షించిన ఆయన ఇదొక గొప్ప ప్రేమ కథ. మంచి సందేశం ఉ ంది. నటీనటులతో పాటు నిర్మాణ విలువలు బాగున్నాయి.

ధర్మ ప్రొడక్షన్స్ సంస్థపై ఈ చిత్రాన్ని రీమేక్ చేస్తున్నాననే విషయం తెలపడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అయితే హిందీ రీమేక్‌లో ప్రధానపాత్రలు ఎవరు పోషిస్తారు అనే దానిపై అభిమానులలో పలు ఆలోచనలు మెదులుతుండగా ఓ ఆసక్తికర వార్త బయటకి వచ్చింది.

దఢఖ్ పెయిర్ ఇషాన్, జాన్వీ కపూర్ రీమేక్ చిత్రంలో హీరో హీరోయిన్‌లుగా నటిస్తారని సోషల్ మీడియాలో పలు వార్తలు పుట్టుకొస్తున్నాయి .

దఢఖ్ చిత్రంలో వీరిద్దరి కెమిస్ట్రీకి మంచి ప్రశంసలు లభించడంతో కరణ్ జోహార్ డియర్ కామ్రేడ్ రీమేక్ చిత్రంలో వారిద్దరిని ఎంపిక చేశాడని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజం ఉ ందనేది తెలియాల్సి ఉంది.

భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కిన డియర్ కామ్రేడ్ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, బిగ్ బెన్ సినిమాస్ పతాకాలపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి(సి.వి.ఎం), యష్ రంగినేని సంయుక్తగా నిర్మిస్తున్నారు. జూలై 26న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలు పోషించిన విషయం విదితమే.

# 'మన్మథుడు 2' ట్రైలర్ విడుదల..!



అక్కినేని నాగార్జున కథానాయకుడిగా నటించిన చిత్రం 'మన్మథుడు 2'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ గురువారం విడుదలైంది. 'అద్భుతం..

అమోఘం.. ఇలాంటి పథకం మహాభారతంలో ఆ శ్రీకృష్ణుడు కూడా వేయలేదు' అంటూ నాగ్ చెబుతున్న డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. నాగ్‌కు ఎలాగైనా పెళ్లి చేయాలనుకుంటారు ఇంట్లోవారు. కానీ ఆయన 'ఒక్క పూట భోజనం కోసం వ్యవసాయం చేయలేను' అంటూ మాటదాటేస్తుం టారు. '

ఇదేమన్నా స్వయవరం అనుకుంటున్నారా ఏంటి' అని నాగ్ అంటే ఇందుకు వెన్నెల కిశోర్.. 'అదే కదా.. మీరేమన్నా మన్మథుడా ఏంటి' అనడం నవ్వులు పూయిస్తోంది. ఇందులో నాగ్ చాలా స్టైలిష్‌గా కనిపించారు. రకుల్ ప్రీత్ సింగ్ కథానాయికగా నటించారు. ఆగస్ట్ 9న సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## మూడోసారి బాలకృష్ణతో సోనాల్ చౌహాన్

'లెజెండ్'లో ఓసారి...''డిక్టేటర్'లో మరోసారి... నందమూరి బాలకృష్ణ సరసన రెండు చిత్రాల్లో సోనాల్ చౌహాన్ నటించారు. ముచ్చటగా మూడోసారి నటించడానికి సిద్ధమవుతున్నారని సమాచారం. బాలకృష్ణ హీరోగా కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో సి. కల్యాణ్ నిర్మాణంలో తాజాగా ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. గతేడాది సంక్రాంతి విజేత 'జై సింహా' తర్వాత, హిట్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా సోనాల్ చౌహాన్‌ను, మరో హీరోయిన్‌గా 'కాంచన' ఫేమ్ వేదికను ఎంపిక చేశారు. పోలీస్ ఆఫీసర్‌గా, గ్యాంగ్‌స్టర్‌గా... రెండు షేడ్స్ ఉన్న రౌడీ పోలీస్ తరహా పాత్రలో హీరో పాత్ర సాగుతుందట! రెండు షేడ్స్ ఉన్న పాత్రలో... ఇరువురు భామల కౌగిలిలో... బాలకృష్ణ కనిపించనున్నారు. ఆగస్టు 7న బ్యాంకాక్‌లో సినిమా చిత్రీకరణ ప్రారంభించనున్నారు. సుమారు నెల రోజులు సాగే ఈ భారీ షెడ్యూల్‌లో రెండు పాటలు, రామ్ – లక్ష్మణ్ నేతృత్వంలో యాక్షన్ దృశ్యాలు, కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు.

# ప్రపంచ శ్రేణిలో "సెల్ఫీ ఆఫ్ సక్సెస్"

### తొలి రచనతోనే బుర్రా వేంకటేశం విశ్వవ్యాప్తం- బి.ఎస్.రాములు



హైదరాబాద్, జులై 25:ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశం ఇంగ్లీష్‌లో తొలిసారిగా వెలువరించిన సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకం అమెజాన్ అమ్మకాల్లో నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు అన్నారు.

సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకాలను కొరియా ప్రతినిధులకు ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు అందజేస్తూ... ఈ సందర్భంగా చైర్మన్ బి.ఎస్.రాములు మాట్లాడుతూ ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశం ఇంగ్లీష్‌లో తొలిసారి వెలువరించిన సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకం పాఠకులనుంచి అత్యుత్తమ పుస్తకంగా ఫైవ్‌స్టార్స్ సాధించి అమెజాన్ అమ్మకాల్లో మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది గ్రంథాలయాలలో ఈ పుస్తకం పాఠకులకు అందుబాటులోకి వచ్చిందని రచయిత బుర్రా వేంకటేశం అన్నారు. ఈ పుస్తకాన్ని హిందీ, తెలుగు, ఉర్దూ, బెంగాలి, ఫ్రెంచ్, రష్యన్, చైనా, స్పానిష్, కొరియా భాషల్లో వెలువరించేందుకు రచయిత బుర్రా వెంకటేశం శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు.

# లండన్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



లండన్, జులై 25: టీఆర్ఎస్ కార్యనిర్వాహణ అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలు లండన్‌లో ఘనంగా జరిగాయి. టీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యుకే ఆధ్వర్యంలో కేటీఆర్ పుట్టినరోజు వేడుకను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఆర్ఎస్ ఎన్ఆర్ఐ అడ్వైసరి బోర్డు చైర్మన్ పోచారం సురేందర్ రెడ్డి హాజరయ్యారు. కార్యవర్గ సభ్యులంతా కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో చేసుకోవాలని, ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటూ పార్టీని, రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కేటీఆర్ పిలుపు మేరకు "గిఫ్ట్ ఏ స్మైల్" లో భాగంగా తమ సొంత గ్రామం పోచారంలోని ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉండేలా వ్యక్తిగత ఖర్చుతో పనులు చేయించడానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇకపై ఎవరు కూడా ప్రైవేట్ పాఠశాలలకి వెళ్లకుండా, కేవలం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలాగ తీర్చిదిద్దుతామని తెలిపారు.

ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ.. అందరూ గర్వపడేలా ప్రజలకు సేవ చేస్తున్న నాయకుడు తెలంగాణలో ఉండడం మన అందరి అదృష్టమన్నారు. ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ సెల్ యుకే ఆధ్యక్షుడు అశోక్ దూసరి మాట్లాడుతూ.. రాష్ట్ర పురోభివృద్ధిలో కేటీఆర్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఐటీ పురోభివృద్ధి కృషి చేసి.. దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామి దిశగా తీసుకువచ్చారని కొనియాడారు. కేటీఆర్‌ను యువతరం ఆదర్శంగా తీసుకుంటోందన్నారు. ఉపాధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ నిర్మాణానికి కేటీఆర్ కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడ్వైసరి బోర్డు సభ్యులు దొంతుల వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నవీన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ కడుదుల, కార్యదర్శులు సత్య చిలుముల మరియు సృజన్ రెడ్డి, జాగృతి రాష్ట్ర నాయకులు రోహిత్ రావు, రవి రేతినేని, శ్రీకాంత్ జెల్లా, సురేష్ బుడగం, గణేష్ పస్తం, నరేందర్, వాసు, రంజిత్ పాల్గొన్నారు.

### కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలను..

# ప్రజల్లో ఎండగడతాం

## – ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు

## – బీజేపీ నేత డి.కె. అరుణ

హైదరాబాద్, జులై25(ఆంఎన్ఎ) : సీఎం కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మాజీ మంత్రి, బీజేపీ నేత డి.కె. అరుణ అన్నారు.

గురువారం ఆమె మాట్లాడుతూ.. హెరిటేజ్ భవనాలను కూల్చి కొత్త సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాలు నిర్మించాలనుకుంటున్నకేసీఆర్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనం డబ్బు వృథాచేస్తూ భవనాల నిర్మాణానికి అడుగు ముందుకేస్తే మాత్రం ప్రతిపక్షాలన్నీ ఒక్కటై ఆ కూల్చివేతలు, నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఉద్యమ ఆకాంక్షలు, ఉద్యమకారులను పక్కకుపెట్టి ఒక్క కుటుంబం కోసం పాలన చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణకు ఉపయోగపడే పని ఒక్కటి కూడా కేసీఆర్ చేయలేదన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేక నిర్ణయాలే తీసుకుంటున్నారన్నారు. చింతమడకను హరీష్‌రావు కాదు? తానే అభివృద్ధి చేస్తున్నా అని చెప్పడానికి కేసీఆర్ ఆ ఊరికి వెళ్లారని డీకే అరుణ చెప్పారు. రాష్ట్రాన్ని అప్పులు పాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం ప్రజాధనాన్ని తన సొంతఖర్చులా ఖర్చుచేస్తూ ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలంతా వర్షాలు లేక, నాటిన విత్తనాలు మొలవక నష్టాల పాలవుతున్నారని, కానీ కేసీఆర్ కనీసం రైతుల కష్టాల్లో పాలుపంచుకొనేందుకు, వారికి అండగా నిలిచేందుకు ముందుకు రావటం లేదన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మళ్లీ రైతులను ఉద్ధరిస్తా, దేశానికే ఆదర్శంగా నిలుపుతానంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. కేవలం రైతుబంధు కింద డబ్బులు ఇచ్చి చేతులు దుపుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైన కేసీఆర్ తనతీరులో మార్పు తెచ్చుకోవాలని ప్రజాపాలనను సాగించేలా దృష్టిపెట్టాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని డి.కె. అరుణ హెచ్చరించారు.

# రేషన్ డీలర్లను తొలగించే ప్రసక్తే లేదు

## – అక్టోబర్ 2నుంచి కొత్త రేషన్ కార్డులిస్తాం

## – పౌరసరఫరాలశాఖ మంత్రి కొడాలి నాని

అమరావతి, జులై25(ఆంఎన్ఎ) : రేషన్ డీలర్లను తొలగించే ప్రసక్తే లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని స్పష్టం చేశారు. గురువారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులనుంచి ఎదురైన ప్రశ్నలకు మంత్రులు సమాధానలిచ్చారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ.. అక్టోబర్ 2 నుంచి గ్రామ వాలంటీర్ల ద్వారా కొత్త రేషన్ కార్డులిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా అర్హులు కాని వారికి కూడా రేషన్ కార్డు ఇచ్చారని వ్యాఖ్యానించారు. రేషన్ కార్డుల వ్యవస్థను గ్రామ సచివాలయాల ద్వారా పూర్తిగా ప్రక్షాళన చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అర్హులకు మాత్రమే దరఖాస్తు చేసుకున్న 72 గంటల్లో రేషన్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. అక్టోబర్ 2 వరకు కొత్త రేషన్ కార్డులివ్వమని చెప్పారు. రేషన్ డీలర్లను స్టాక్ పాయింట్‌గా పెడతామని.. వారికి వచ్చే కమిషన్‌ను కొనసాగిస్తామని అన్నారు. గ్రామ వాలంటీర్ల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

తెలుగు భాష అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది – మంత్రి అవంతి

ఏపీలో తెలుగు భాష అభివృద్ధి వైసీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు.

గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో తెలుగు భాషపై సభ్యుల నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం తెలుగును నిర్లక్ష్యం చేసిందని అవంతి మండిపడ్డారు. మాతృభాషను ప్రతి ఒక్కరు మర్చిపోవద్దన్నారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను తెలుగు భాష అధికార ప్రతినిధిగా త్వరలోనే నియమించనున్నట్టు ప్రకటించారు. రాబోయే రోజుల్లో జీవోలను తెలుగులో విడుదల చేస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగులో బోర్డులు పెట్టేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తెలుగు భాష అభ్యున్నతికి ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తయ్యేందుకు చర్యలు – మంత్రి బొత్స

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తయ్యేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో గుంటూరు భూగర్భ డ్రైనేజీ నిర్మాణంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గుంటూరు భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి కేంద్రం నుంచి రూ. 540 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. కానీ ఇప్పటివరకు రూ. 391 కోట్ల పని మాత్రమే జరిగిందన్నారు. భూగర్భ డ్రైనేజీకి రూ. 363 కోట్లు ఇవ్వాల్సి ఉండగా చంద్రబాబు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పటికీ రూ. 24 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉందన్నారు. భూగర్భ డ్రైనేజీ పనులపై అనేక ఆరోపణలు వస్తున్నాయని చెప్పిన ఆయన.. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపిస్తామన్నారు. డ్రైనేజీ పనులు త్వంగా పూర్తయ్యేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై సభ్యుల నుంచి వచ్చిన ప్రశ్నలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని జవాబిచ్చారు. రాష్ట్రంలో మొత్తం 1145 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.